RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 90 శుక్రవారం 25 ఏప్రిల్ 2025 పేజీలు : 4

### భారత సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్స్...

భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. అందుకు బంగ్లాదేశ్ ఆర్మీ పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బైరక్టార్ TB-2 కిల్లర్ డ్రోన్‌ను మోహరించడమేనని చెప్పవచ్చు. బంగ్లాదేశ్ ఆర్మీ మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగింది. ఈ ప్రాంతం భారతదేశంలో చాలా సున్నితమైనదిగా పరిగణించబడుతుంది. టర్కియే TB-2 డ్రోన్ చాలా శక్తివంతమైనది. ఇది దాడి చేయడమే కాకుండా, గూఢచర్యం చేయడంలో కూడా సహాయపడుతుంది. దీంతో ఇరు దేశాల మధ్య పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ డ్రోన్‌లను బంగ్లాదేశ్‌లో 67వ సైన్యం నిఘా కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని చెబుతున్నారు. బంగ్లాదేశ్ రక్షణ అవసరాల కోసం మోహరింపు అని చెప్పినప్పటికీ, ఆధునాతన డ్రోన్‌లను సున్నితమైన ప్రాంతంలో ఉంచడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# ముందుంది ముసళ్ల పండుగ!

మన దేశంపై ఉగ్రదాడికి కారణమైన పాపిష్ఠి పాకిస్థాన్ కు భారత దేశం కీలెరిగి వాత పెడుతుంది. ఈ నేపథ్యంలో ఆ దేశంలో ఉన్న అన్ని దౌత్యపరమైన సంబంధాలను తెగతెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. అంతేకాదు మన దేశంలో పాక్ దౌత్య కార్యాలయంలో పనిచేస్తోన్న 50 మంది పాక్ దేశస్థులను 30కి తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. మరోవైపు తాజాగా మోడీ ప్రభుత్వం పాకిస్థాన్ ప్రభుత్వ ట్విటర్ ఖాతా నిలిపివేస్తూ సంచలన నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో ఆ దేశంతో మాటలు లేవు.. మాట్లాడాలు లేవు అన్నట్టు పాకిస్థాన్ ను అష్ట దిగ్బంధనం చేసే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతాను భారత్ బ్యాన్ చేసింది.. ఆ ట్విటర్ పేజీ ఓపెన్ చేస్తే 'విత్‌అల్డ్' అని చూపిస్తోంది. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్ తో ఎలాంటి

# పాకిస్థాన్ కు భారత్ వరుస షాకులు!!

## మోడీ దెబ్బకు పాక్ గిలగిలా..

సంప్రదింపులు చేయమని తెగేసి చెప్పినట్టైయింది. వారితో దౌత్యపరమైన చర్చలకు ఉన్న అన్ని దారుల్ని భారత్ మూసేసింది.

అంతేకాదు భారత్, పాకిస్థాన్ ఇరు దేశాల మధ్య రాక పోకల్ని, దౌత్య సంబంధాల్ని కట్ చేసి పడేసింది. అటు సింధు జలాల ఒప్పందాన్నీ రద్దు చేసింది. ఇప్పుడు నెట్టింట కూడా పాక్ కు యాక్సెస్ లేకుండా అడ్డుకుని దిమ్మ దిరిగే షాక్ ఇచ్చింది. భారత్‌లోని పాక్ పర్యాటకులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవావాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఉగ్రవాదుల కోసం వేట సాగుతుంది. జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని ఎల్‌ఓసీ వెంబడి చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేసినట్లు భారత సైన్యం తెలిపింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఆపరేషన్ జరుగుతోందని వెల్లడించింది. ఈ రోజు డిఫెన్స్ మినిస్టర్ ఆధ్వర్యంలో అఖిల పక్ష భేటీ జరగనుంది. అంతేకాదు ఈ భేటిలో భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతిపక్షంతో పాటు ఇతర పార్టీలకు వివరించే అవకాశం ఉంది. దేశ భద్రత దృష్ట్యా అన్ని పార్టీలు కేంద్రంలోని




ప్రభుత్వానికి బేషరుతుగా మద్దతుగా ఇవ్వనున్నట్టు తెలుస్తుంది.

**భారత్ సంచలన నిర్ణయం.. పాక్‌తో అన్నిరకాల దౌత్య సంబంధాల తెగదెంపులు..** పహల్గం ఉగ్రదాడి ఘటన దేశంలో సంచలనంగా మారింది. దీనిపై భారత్ సీరియస్ అయ్యింది. ఇప్పటికే మోదీ ఆధ్వర్యంలో హైపవర్ సమావేశం కూడా జరిగింది. అయితే.. ప్రస్తుతం భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. పాక్ తో అన్నిరకాల దౌత్య సంబంధాలు తెగదింపులు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. అదే విధంగా అటారీ చెక్ పొస్టును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. సింధూజలాల ఒప్పందం కూడారద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. వీసాలను రద్దు చేసింది. పాక్ పౌరులను ఎట్టిపరిస్థితుల్లో భారత్ లోకి అనుమతించేదిలేదని భారత్ తెల్చిచెప్పింది.

పాక్.. రాయబార కార్యలయ సిబ్బందిని.. 50 నుంచి 30 కి తగ్గించారు. భారత్ లో ఉన్న పాక్ వారు.. 48 గంటల్లో వెళ్లిపొవాలని భారత్ హుకుం జారీ చేసింది. భారత్ పహల్ గామ్ ఘటనపై చాలా సీరియస్ గా ఉంది. అయితే.. గతంలో.. ఉరి, పుల్వామా తర్వాత కూడా సింధు జల ఒప్పందం నిలిపివేయబడలేదు. కానీ .. అమాయక పర్యాటకులపై పహల్గామ్ ఉగ్రవాద దాడి ఘటనను మాత్రం భారత్ చాలా సీరియస్ గా తీసుకుంది. ఈ క్రమంలో మోదీ నివసంలో.. కేంద్ర మంత్రులు, ముఖ్య అధికారుల ఆధ్వర్యంలో హైపవర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో.. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా, జాతీయ భద్రత సలహాదారు అజిత్ ధోబాల్ తదితరుల ఆధ్వర్యంలో హైపర్ సమావేశం జరిగింది.

ఈ నేపథ్యంలో పాక్ సీఎం ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశంకు రావాలని ఇప్పటికే సీఎం... అన్నిపార్టీల నేతలకు లేఖలను రాశారు. ఈ క్రమంలో భారత్ తీసుకున్న ప్రస్తుతం నిర్ణయం మాత్రం పాక్ కు గట్టి హెచ్చరికగా చెప్పుకొవచ్చు. మొత్తంగా పాక్ ను భారత్ గట్టిగా జవాబు చెప్పాలని యావత్ భారతావని ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. సీమాంతర ఉగ్రవాదంను కూకటి వెళ్లతో అణచివేసే దిశగా భారత్ చర్యలు తీసుకుందని చెప్పుకొవచ్చు.



### సీతారామ ఎత్తిపోతల పథకానికి సాంకేతిక అనుమతులు

దిల్లీ: సీతారామ ఎత్తిపోతల పథకానికి సాంకేతిక అనుమతులు లభించాయి. ఈ పథకానికి అనుమతులివ్వాలని కేంద్ర జల సంఘం ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సీతమ్మసాగర్ ఆనకట్టకు కూడా అనుమతులివ్వాలని సిఫారసులో పేర్కొంది. దిల్లీలో కేంద్ర జల సంఘంతో జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, ఈఎన్‌సీ, ఇంజినీర్లు పాల్గొన్నారు. సీతారామ ఎత్తిపోతల ద్వారా 7.87లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 67టీఎంసీలతో సీతారామ ఎత్తిపోతల ద్వారా భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు తాగు, సాగునీరు అందుతాయి. అలాగే.. సాగర్, వైరా, పాలేరు ఆయకట్టులను స్థిరీకరించొచ్చు.




చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద యాంటీ–నక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపుర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు.



### హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్: భట్టి విక్రమార్క

హైదరాబాద్: భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. రేపటి నుంచి జరిగే ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

'ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ గురించి వివరిస్తాం. ఇందిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం. ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని మంత్రి తెలిపారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి



# పార్టీ పదవుల పంపకాలకు కసరత్తు

## నేటి నుంచి మే 20 వరకు సమావేశాలు

### మండల స్థాయి నుంచి డీసీసీ వరకు పదవుల నియామకాలపై తలమునలైన పార్టీ పెద్దలు!

హైదరాబాద్ : హస్తం పార్టీలో పదవుల పందేరానికి రంగం సిద్ధమవుతోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యాచరణలో భాగంగా మండల స్థాయి నుంచి పీసీసీ దాకా కార్యవర్గాలను ఏర్పాటు చేసేందుకు అగ్రనాయకత్వం రూట్‌మ్యాపను ఖరారు చేసింది. ఈ మేరకు ఈ నెల 25 నుంచి మే 20వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూనే మహిళలు, యువతకు పదవు ల్లో పెద్దపీట వేయాలని అధిష్ఠానం సూత్రప్రాయంగా నిర్ణయించడం, ఇకపై పార్టీ కమిటీలే అన్ని నిర్ణయాల్లో కీలక పాత్ర వహిస్తాయనే సంకేతాలతో వీటిని దక్కించుకునేందుకు నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు పార్టీ పదవులతో సరిపుచ్చకుండా, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేళ్లపాటు సైనికు ల్లా పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు నామినేటె డ్ పదవులు ఇవ్వాలని, ఇప్పటికే జాప్యం చేశారని, ఇంకా జాప్యం చేస్తే ఎలా అని పదవులను ఆశిస్తున్న ఆశావహులు ఒత్తిడి తెస్తున్నారు. మొత్తంగా పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి మొదలైంది.

**2017 నుంచి పార్టీలో ఉన్న వారికే పదవులు...** కాంగ్రెసలో మండల, బ్లాక్, డీసీ సీ పదవుల్లో సీనియర్లకే ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. 2017 నుంచి పార్టీలో ఉన్నవారికే పదవులు ఇవ్వాలని సూచించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె ఈ మేరకు కీలకమైన సూచనలు చేశారు. పార్టీ మండల అధ్యక్షులు మొదలు బ్లాక్ కాంగ్రెస్, డీసీసీ అధ్యక్ష పదవుల్లో ఈ నియమం పాటించాలని ఆదేశించారు. మహిళలు, యువతకు ప్రాధాన్యం పెంచాలని సూచించారు. డీసీసీలు, మండల, బ్లాక్ కమిటీలే ఇకపై పార్టీలో క్రియాశీలక పాత్ర వహిస్తాయని, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని ఇప్పటికే సంకేతాలివ్వడంతో ఈ పదవులు దక్కించుకునేందుకు నేతల్లో పోటీ మొదలైంది. సంస్థాగత ఎన్నికల నిర్వహణ నిమిత్తం జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను నియమించి, వారికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ నెల 25 నుంచి మే 20వర కు అన్ని స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి ఈ పదవులకు నాయకుల ఎంపిక పూర్తిచేయాలని నిర్ణయించారు. మండల అధ్యక్ష పదవికి ఐదుగురు చొప్పున అభ్యర్థులను సిఫార్సు చేయాలని, బ్లాక్, డీసీసీ అధ్యక్ష పదవులకు ముగ్గురు చొప్పున పేర్లను సూచించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఏఐసీసీ సభ్యులు, పీసీసీ సభ్యులు, ఇతర పార్టీ డెలిగేట్స్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృతాభిప్రాయాలను పరిశీలకులు సేకరించి జాబితాలను వడపోస్తారు. చివరికి పీసీసీకి నివేదిస్తారని, సామాజిక సమీకరణలు, నాయకుల సమర్థత, సీనియార్టీ, నియోజకవర్గాలు, ఆయా బ్లాక్, జిల్లాల్లో పరిస్థితులు, పార్టీ బలోపేతానికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకొని పదవుల పంపకాలు ఉంటాయని బు?ధవారం సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు పేర్కొన్నారు. తాజాగా, ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహిస్తారు. మే 4 నుంచి 19 వరకు బ్లాక్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు, మే 13 నుంచి 20 వరకు మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. మండలస్థాయి మొదలు పీసీసీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షుల వరకు నియామకాలకు సిఫార్సులు తీసుకోవాలని నిర్ణయించారు.

# సంపాదకీయం

## పాక్ కి మూడిందా...అందుకేనా ?

భారతదేశంలో తమకు రక్షణ లేదని ఒక వర్గం ప్రజలు మత ప్రాతిపదికన విడిపోతే పాకిస్తాన్ ఏర్పాటు అయింది. అలా ఏర్పడిన పాకిస్థాన్ ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో ఏ మాత్రం అభివృద్ధి చెందలేదు సరికదా ఆకలి, అవినీతి అక్రమాలతో సతమతమవుతోంది. ఇక పాకిస్థాన్ నుంచి తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్ గా విడిపోయింది. అదే విధంగా బెలూచిస్తాన్ కూడా విడిపోవాలని బలంగా కోరుకుంటోంది. ఇక బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా మారాలని కోరికతో ఉంది. ఇది పాకిస్తాన్‌లో ఒక ప్రావిన్స్ గా ఉంది. స్వతంత్రత కోసం పోరాడుతోంది. చారిత్రకంగా చూస్తే కనుక బలూచిస్తాన్ ప్రాంతంలోని గణనీయమైన భాగం ఇరాన్ ఆఫ్ఘనిస్తాన్‌లలో కూడా విస్తరించి ఉంది. బలూచిస్తాన్‌లో వేర్పాటువాద ఉద్యమాలు ఏళ్ళుగా కొనసాగుతున్నాయి. అలాగే ఉద్రిక్తతలు ఉన్నాయి. పాకిస్తాన్ నుంచి వేరుపడాలన్నది బలూచిస్తాన్ కోరిక ఉంది. గతంలో తూర్పు పాకిస్థాన్ ని పాక్ నుంచి వేరు చేసి బంగ్లాదేశ్ గా ఏర్పాటు చేయడంలో భారత్ పాత్ర చాలా కీలకంగా ఉంది. ఇపుడు బలూచిస్తాన్ కూడా భారత్ జోక్యం కోరుతూ వస్తోంది. అయితే భారత్ మాత్రం ఇప్పటిదాకా ఆ విషయం పట్టించుకోలేదు. మరో వైపు చూస్తే పాకిస్తాన్ మీద యుద్ధమే చేస్తూ బలూచిస్తాన్ తన ఉద్యమ కోరికను అలా నిలబెట్టుకుంటోంది. ఇది పాకిస్తాన్ కి చికాకుగానే ఉంది. ఈ నేపథ్యంలో బలూచిస్తాన్ కి కనుక భారత్ మద్దతుగా ఉంటే పాక్ మరింతగా బలహీనం అవుతుంది బలూచిస్తాన్ వనరులను దోచుకుంటూ ఆ ప్రావిన్స్ ని ఏ మాత్రం పట్టించుకోకుండా పాకిస్తాన్ వ్యవహరిస్తోంది. భారత్ ఇపుడున్న నేపథ్యంలో కనుక తన రాజనీతిని వాడితే కనుక పాక్ చిక్కి శల్యం అవడమే కాదు ముక్క చెక్కలు అవుతుంది అని అంటున్నారు. మరో వైపు పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని స్వాధీనం చేసుకునే ఆలోచన కూడా ఉందని అంటున్నారు. దాంతో పూర్తి స్థాయిలో పాక్ ఆట కట్టు అవుతుందని కూడా భావిస్తున్నారు. ఈ రోజున ప్రపంచం అంతా భారత్ లో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తున్నారు. దాంతో పాక్ ఏ విధంగానూ సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉంది. దాంతో ఇదే అదనుగా భారత్ కనుక తన పదునైన వ్యూహాలను అమలులోకి తెస్తే పాకిస్థాన్ ముక్క చెక్కలు కావడం ఖాయమని అంటున్నారు. భారత్ నుంచి విడిపోయినపుడు బంగ్లాదేశ్ సహా అన్నింటినీ తనతో ఉంచుకున్న పాక్ ఇపుడు బాగా తగ్గిపోతోంది. దాంతో పాక్ కి సరైన సమయంలో దెబ్బ తీస్తే ఇక భవిష్యత్తులో భారత్ వైపు కన్నెత్తి చూసే అవ్కాశం అసలు ఉండదని అంటున్నారు. భారత్ పాకిస్థాన్ కి శాశ్వతంగా బుద్ధి చెప్పేందుకే చూస్తోంది అని అంటున్నారు. అంతే కాదు అంతర్జాతీయ సమాజం ఇచ్చిన మద్దతుని సక్రమంగా వాడుకుంటూ సీమాంతర ఉగ్రవాదానికి పూర్తి స్థాయిలో చెక్ పెట్టేందుకే భారత్ ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఏది ఏమైనా నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంచలనాత్మకమైన నిర్ణయాలే తీసుకుంటుంది అని అంటున్నారు. ఈ దెబ్బతో పాక్ కి మూడుతుది అని అంటున్నారు. భారత్ తో ఎందుకు పెట్టుకున్నామా అని పాక్ విలపించినా ఫలితం ఉండదని అంటున్నారు.

# ఎక్కడెంత..ఎవరిదెంత..?



హైదరాబాద్ : రాష్ట్రంలో నివసిస్తూ.. ఇండో- పాకిస్థాన్ యుద్ధం జరిగినప్పుడు ఇక్కడ ఉండలేక పాకిస్థాన్‌కు వెళ్లిన కొన్ని కుటుంబాల ఆస్తులను ఎనిమీస్ ప్రాపర్టీస్‌గా పిలుస్తుంటారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ త్వరలో వీటి లెక్క తేల్చనుంది. కొన్ని భూములు ఆక్రమణకు గురికాగా.. కొంత ప్రజాప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోవడంతో వాటి విస్తీర్ణం తగ్గిపోయింది. తాజాగా వాటి స్థితిగతులను తెలుసుకొని కేంద్రం పరిష్కారం చూపనుంది. గ్రేటర్ పరిధిలో ఎనిమీస్ ప్రాపర్టీస్ భూముల విలువ మార్కెట్ ధరల ప్రకారం రూ.50వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**ఎకరా రూ.కోట్లలో..** కొత్వాల్‌గూడలో ఎకరా భూమి రూ.50కోట్లకుపైగా ఉండగా.. మియాపూర్‌లో రూ.50కోట్ల నుంచి రూ.70కోట్ల వరకూ పలుకుతోంది. ముషీరాబాద్‌కు సమీపంలోని బాకారంలో ఉన్న 25వేల చదరపు గజాల స్థలం కూడా గజం రూ.లక్ష నుంచి రూ.2లక్షలు మధ్య ఉంది. ఈ భూములను సర్వే చేసి హద్దులు సక్రమంగా ఉన్నాయా? ఎవరైనా ఆక్రమించుకున్నారా? రైతులు సాగుచేస్తున్నారా? ఆక్రమణదారులు ఎవరికైనా విక్రయించారా? అక్కడ పరిశ్రమలేవైనా ఉన్నాయా? అన్న అంశాలను నివేదిక రూపంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు మార్చి నెలాఖరులోపు పంపించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులను ఆశించారు.

**క్రమబద్ధీకరణకు అవకాశం..**

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తనకున్న విచక్షణాధికారాలు, ఎనిమీస్ ప్రాపర్టీస్ పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం.. విషయం తెలియకుండా ఆ భూములు కొన్నవారు, పాకిస్థాన్‌కు వలసవెళ్లిన యజమానుల కుటుంబ సభ్యుల వారసులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రయోజనాల కోసం లీజుకిచ్చిన భూములను క్రమబద్ధీకరించే అధికారం ఉంది.

సెక్షన్8 ప్రకారం రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ, మియాపూర్‌లోని 890 ఎకరాల్లో కొంత భాగం మినహా.. మిగతా భూములు రాష్ట్ర ప్రభుత్వానికే వస్తాయని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కొత్వాల్‌గూడలో బాహ్యవలయ రహదారి నిర్మాణం కోసం కొన్ని ఎకరాలను హెచ్ఎండీఏ తీసుకుంది.

తప్పుడు పత్రాలతో ఆక్రమించుకున్న వారి నుంచి భూములను స్వాధీనం చేసుకుంటే అవసరాలకు ఉపయోగపడతాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

**గ్రేటర్ పరిధిలోనే అత్యధికం..**

రంగారెడ్డి జిల్లా - 690 ఎకరాలు

హైదరాబాద్ - 5.26 ఎకరాలు

శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ - 630 ఎకరాలు

మియాపూర్ - 260 ఎకరాలు

# నిధుల్లేక నిరాశ.. ప్రగతికి ప్రయాస



బషీరాబాద్ : పంచాయతీలకు పాలకులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి మరమ్మతులు, విద్యుత్ దీపాలు, ఇతర ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా వెంటనే పనులు చేయించాలంటే డబ్బులు అవసరం. సాధారణ నిధులు, పన్ను వసూలు నిధులపైనే ఆధారపడాల్సి వస్తోందని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

**రావాల్సింది రూ.60కోట్లు..**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రతి ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. వీటితో వార్డుల్లో అత్యవసర పనులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, దోమల నివారణ, పైప్‌లైన్ల మరమ్మతులు, ఇతర ప్రజా ఉపయోగ పనులను చేయాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ముగింపు వరకు జిల్లాలోని పంచాయతీలకు రూ.60కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.35-40 కోట్లు మొత్తంగా రూ.100 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి కాగా, సాధారణ నిధులు, పన్నుల వసూళ్ల రాబడితో పంచాయతీల నిర్వహణ జరుగుతోంది.

**కార్యదర్శులపైనే భారం..:** సర్పంచి ఎన్నికల గడువు ముగిసి ప్రత్యేకాధికారులతో పల్లెపాలన కొనసాగడం ఏడాది కావస్తోంది. సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులపైనే భారం పడుతోంది. ఏసమస్య వచ్చినా సొంతంగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది. విద్యుత్ దీపాలకు, మోటర్ల మరమ్మతులకు వెచ్చించిన డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందంటున్నారు. రాష్ట్ర నిధులు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకే సరిపోతుందంటున్నారు.

**సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం**

పంచాయతీల్లో నిధులు లేకున్నా.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. సర్పంచులు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు ఆగాయి. స్థానిక సంస్థల ఎన్నికల తరువాతే నిధులు విడుదలవుతాయి. పన్నుల వసూలు, సాధారణ నిధులతో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి, వికారాబాద్.

పంచాయతీలు: 566

వార్డులు: 5,058

జనాభా: 12,90లక్షలు

15వ ఆర్థిక సంఘం నిధులు: రూ.60 కోట్లు (ఏడాదికి)

రాష్ట్ర నిధులు: రూ.35-40 కోట్లు (ఏడాదికి)

# పనుల జోరు.. పల్లె రోడ్డు మారె



తాండూరు : దారిపొడవునా కంకరతో ప్రయాణ కష్టాలు పడ్డారు. అనేక మంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాల పాలయ్యారు. ఆస్పత్రుల్లో చేరి జేబులు ఖాళీ చేసుకున్నారు. రెక్కలుముక్కలు చేసుకొని సంపాదించిన కూలీ డబ్బులు మోటారు సైకిళ్ల మరమ్మతులకు వెచ్చించారు. ఎట్టకేలకు కంకర దారులను తారు రహదారులుగా తీర్చిదిద్దడంతో ప్రయాణ బాధలు తీరాయి. వందల సంఖ్య వాహనదారులకు ఊరట లభించింది.

**రూ.54 లక్షల మంజూరులో ఎట్టకేలకు కదలిక:** తాండూరు మండలం వీరారెడ్డిపల్లి నుంచి జాతీయ రహదారి వరకు ఏళ్లుగా మరమ్మతులు లేక తారు తుడిచిపెట్టుకుపోయింది. దారిపొడవునా కంకరతో రహదారి ఆనవాళ్లు కోల్పోయింది. రహదారి నిర్మించాలంటూ గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులుకు మొరపెట్టుకున్నారు. మూడు సంవత్సరాలుగా ప్రయాణ బాధలతో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రూ.54లక్షలు మంజూరు చేయడంతో నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. గుత్తేదారు కంకర వేసి మూడు నెలలుగా వదిలేయగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో శనివారం తారు పనులు చేపట్టారు. కంకర మార్గంలో తారు రహదారి అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలకు రహదారి సమస్య తీరిందని సంబురపడుతున్నారు.

**సిరిగిరిపేటకు ఏడాదిన్నరగా..**

సిరిగిరిపేట నుంచి జాతీయ రహదారి వరకు మధ్యమధ్యలో తారు రహదారి దెబ్బతింది. గుంతలుపడి కంకర తేలింది. దీంతో రహదారి నిర్మాణానికి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో గుత్తేదారుతో అధికారులు దారిపొడవునా జేసీబీ యంత్రంతో చదును చేయించారు. అంతా రహదారి నిర్మిస్తారని భావించారు. కానీ అక్కడక్కడ గుంతలు పడిన రహదారి మార్గాన్ని పూర్తిగా తవ్వేయడంతో కంకరతేల్చి వదిలేశారు. తారు రహదారి నిర్మించకపోవడంతో ఉన్న దారిని చదును చేసి ప్రయాణాన్ని మరింత క్లిష్టతరం చేశారని గ్రామస్థులు మండి పడ్డారు. ఏడాదిన్నర నుంచి కంకర మీదుగా ప్రయాణానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఒకదశలో ప్రధాన పార్టీకి చెందిన నియోజకవర్గ స్థాయి నేతలు గ్రామానికి వెళ్లేందుకు నిరాకరించారు. వస్తే గ్రామస్థులు రహదారి నిర్మాణంపై నిలదీస్తారని వెనకడుగు వేశారు. రెండు రోజుల క్రితం రూ.39.80లక్షలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు తారు రహదారి నిర్మాణ పనులు ప్రారంభింపజేశారు. కొత్తగా తారు రహదారి నిర్మించడంతో రాకపోకలకు సౌలభ్యంగా మారిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# పోలోమంటూ మైదానాలకు

హైదరాబాద్ : చల్‌చల్ గుర్రం.. చలాకీ గుర్రం అంటూ అశ్వాలపై స్వారీ చేసేందుకు సెలబ్రిటీలు... రాజకీయ ప్రముఖులు ఆసక్తి చూపుతున్నారు. నగర శివారు శంకర్‌పల్లి, మొయినాబాద్ ప్రాంతాల్లోని పోలో మైదానాల్లో గుర్రపు స్వారీలో శిక్షణ పొందుతున్నారు. సెలబ్రిటీల వారసులు.. కొత్తగా సినీరంగంలోకి వెళ్లాలనుకుంటున్న వారూ నేర్చుకుంటున్నారు. గుర్రాలను ఇష్టంగా పెంచుకునే సినీ నటుడు రామ్‌చరణ్ పోలో మైదానాల నిర్వాహకులకు సంరక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. నాలుగైదేళ్లుగా శిక్షణకు ఔత్సాహికులు ఎక్కువగా వస్తున్నారు.శిక్షణ కాస్త ఖరీదే... గుర్రపు స్వారీ శిక్షణ కాస్త ఖరీదే. వృత్తిపరంగా.. హాబీగా నేర్చుకుంటే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశా లుంటాయన్న భావనతో పిల్లలు.. యువకులు పోలో మైదానాలకు వెళ్తున్నారు. ప్రవేశ కోర్సు 16 రోజులకు రూ.15వేలు, అడ్వాన్స్‌డ్ కోర్సు మరో 16 రోజులు, జంపింగ్ సెషన్స్ 16 రోజుల పాటు శిక్షణ తీసుకోవాలి. ఈ శిక్షణ పూర్తయ్యాక గుర్రపు స్వారీ చేయాలంటే రుసుం చెల్లించాలి.

ఆరేళ్ల చిన్నారుల నుంచి అరవైఏళ్ల వయసున్న వారూ నేర్చుకోవచ్చు.. బరువు 90కిలోలు మించకూడదు. ఉదయం 6 గంటల నుంచి 8.30



వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 కోసం శిక్షణ ఇస్తారు. సినీ నటులు, ఇతర ప్రముఖుల కోసం ప్రత్యేక ఎరీనాలు (మైదానాలు) అందుబాటులో ఉన్నాయి.

**రూ.లక్షల్లో ధరలు..**

గుర్రాల సంరక్షణకు పోలో మైదానాల నిర్వాహకులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బ్రీడ్ ఆధారంగా ఒక్కో గుర్రం రూ.2లక్షల నుంచి రూ.30లక్షలుంటుందని ఓ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు తెలిపారు. వీటి పోషణ కోసం కూడా భారీగానే వెచ్చిస్తామని చెబుతున్నారు. కొందరు ప్రముఖులు సొంతంగా గుర్రాలను కొనుగోలు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను పోలో మైదానాల్లోని వారికి అప్పగిస్తుంటారు. ఇందుకు నెలకు ఒక్కో గుర్రానికి కనీసం రూ.35వేలు తీసుకుంటున్నారు. శిక్షణ ఇచ్చేవారికి నిర్వాహకులు రూ.40వేల నుంచి రూ.లక్ష వరకూ వేతనం ఇస్తున్నారు.

# హైదరాబాద్ మెట్రో.. 40 కి.మీ.లు.. 40 నిమిషాలు

హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రోలో 40 నిమిషాల్లో చేరుకునేలా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) తయారీపై హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు (హెచ్ఏఎంఎల్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రోరైలు విస్తరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. విమానాశ్రయం నుంచి మీర్‌ఖాన్‌పేటలో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు జరుగుతున్న సర్వే పనులను హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు.

**ఫోర్త్ సిటీకి ఇలా..**

విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీకి దాదాపు 40 కి.మీ.దూరం ఉంటుంది. టర్మినల్ నుంచి మొదలై.. కొత్తగా చేపట్టే మెట్రో రైలు డిపో సమీపం నుంచి విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి మెట్రో మార్గం కొంత భూమార్గంలో, మరికొంత ఎలివేటెడ్‌గా వెళ్తుంది. బహదూర్‌గూడలోని 1000 నుంచి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తారు.

పెద్ద గోల్కొండ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల



ఎగ్జిట్ వరకు 14 కి.మీ. పొడవున మెట్రో ఎలివేటెడ్ మార్గమే. రావిర్యాల నుంచి కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్ పేట వరకు దాదాపు 22 కి.మీ. దూరం ఉంటుంది. ఇందులో 18 కి.మీ. వరకు భూమార్గంలోనే మెట్రో వెళ్తుంది. ఇక్కడ హెచ్ఎండీఏ 100 మీటర్ల వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు మెట్రోరైలుకు కేటాయించారు. ఇందులో మెట్రోని భూమార్గంలో నిర్మిస్తారు.

మేడ్చల్, శామీర్‌పేట కారిడార్లతో పాటూ ఈ ఫ్యూచర్‌సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్‌ను సైతం మార్చి నెలాఖరుకు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి సమర్పిస్తామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

ప్రాథమికంగా డీపీఆర్ స్వరూపమిలా...(కి.మీ.లలో..)

ప్రతిపాదిత స్టేషన్ల సంఖ్య 16

భూమార్గం 18

తక్కువ ఎలివేటెడ్ (ఓఆర్ఆర్ వెంట) 14

ఎలివేటెడ్ దూరం 6

భూ గర్భంలో మెట్రో 2

మొత్తం దూరం 40

# పర్యావ'రణం'..!

మిర్యాలగూడ : మనం ఎంత ఎత్తుకు ఎదిగినా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా.. చివరకు నిలబడాల్సింది భూమి మీదే. భూమిని మనం తల్లిలా భావిస్తాం. అలాంటి భూమాతకు అవసరం, అభివృద్ధి పేరుతో అనేక రకాలుగా విఘాతం కలిగిస్తున్నాం. నింగీ, నేల, నిప్పు, గాలి, నీరు అనే పంచ భూతాలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుంది. వీటిలో ఏది లోపించినా జీవుల జీవనం అస్తవ్యస్తమవుతుంది.

**వనరులన్నీ ఖతం..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవలి కాలంలో అనేక అభివృద్ధి పనులు, పరిశ్రమల ఏర్పాటు, రహదారుల విస్తరణ చేపట్టారు. వీటి కోసం చెట్లు, అడవుల నరికివేత, కొండలను పిండి చేసి మైదానాలుగా మార్చడం వంటి చర్యలు చేపట్టారు. మరోవైపు భూమి లోపలి వనరులైన భూగర్భ జలాలు, ఖనిజాలు, సున్నపురాయిని వెలికితీయడం వంటి చర్యలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయి. పర్యావరణ అసమతుల్యం ఏర్పడి భూతాపం పెరగడం, వర్షాలు సక్రమంగా కురవకపోవడం వంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నివాస స్థలాలు, భవన నిర్మాణాల కోసం సైతం వనరుల వినియోగం విపరీతంగా పెరిగింది.

**పాతాళానికి గంగ..**

ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు ఏటా పాతాళానికి పోతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భూగర్భ జలాల లభ్యత కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ యాదాద్రి జిల్లాలో మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. గతేడాది మార్చిలో యాదాద్రి జిల్లాలో 9.94 మీటర్ల లోతున భూగర్భ జలాలు లభ్యం కాగా ఈ ఏడాది మార్చిలో 12.05 మీటర్లకు పడిపోయాయి. నల్గొండ జిల్లాలో గుండ్లప



ల్లి, మునుగోడు, మర్రిగూడ మండలాల్లో భూగర్భ జలాలు మరింత కిందకు వెళ్లగా, సూర్యాపేట జిల్లాలో తిరుమలగిరి, మద్దిరాల, చివ్వెంల, ఆత్మకూరు ఎస్ మండలాల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

**మొక్కలు నాటుదాం**

ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెట్లను ఎడాపెడా నరకడం, అడవులను మైదానాలుగా పలు అభివృద్ధి పనులకు ఉపయోగించడం, ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగించడం తదితర కారణాలతో పర్యావరణ కాలుష్యం ఏర్పడి భూమిపై మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనిని నివారించాలంటే ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడిచి పెట్టి తరచూ మొక్కలు నాటాలి. అవిరెండ్ల సందీప్‌కుమార్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

**కాటేస్తున్న కాలుష్యం...**

పదేళ్ల కాలంలో పరిశ్రమల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటిలో పలు పరిశ్రమల నిర్వహణ నిబంధనల ప్రకారం చేపట్టకపోవడంతో వీటి నుంచి వెలువడే కాలుష్యం భూమి, నీరు, గాలిని కలుషితం చేస్తుంది. మరోవైపు ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో నిత్యం 365 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఉమ్మడి జిల్లా జనాభా సుమారు 37.48లక్షలు. ఈలెక్కన ఒక మనిషి ఏటా 3,748 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు.


# ఎంపికైతే.. రూ.కోటి

భానుపురి : ఇంటింటికి సౌర వెలుగులు విరబూయనున్నాయి. ప్రతి గ్రామంలో అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తోంది. సౌరశక్తిలో ఆదర్శంగా నిలిచిన జిల్లాలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రూ.కోటి నజరానా ప్రకటించింది. ఇంటింటికీ సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవడానికి పంచాయతీల మధ్య పోటీతత్వం పెంచింది. దీనికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ) సభ్యులు 5 వేల జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేయనున్నారు. వచ్చే ఆరునెలల్లో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ఉత్తమంగా నిలిచిన వాటికి నగదు పురస్కారం అందించనుంది.

**కాలుష్యం తగ్గించడానికి**

కేంద్ర ప్రభుత్వం పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల కింద సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు రాయితీ ఇస్తోంది. దీంతో సౌర విద్యుదుత్పత్తిని విస్తరించేందుకు గ్రామాల మధ్య పోటీ పెంచింది. కలెక్టర్ ఛైర్మన్‌గా, రెడ్కో అధికారి కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జడ్పీ సీఈవో, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, పీఆర్ ఈఈ, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సభ్యులుగా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో 5 వేల జనాభా కలిగిన గ్రామాలను ఎంపిక చేస్తారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆరునెలల్లో ఇళ్ల పైకప్పులపై అత్యధికంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్తు ఉత్పత్తి చేసిన గ్రామాలను



జిల్లాస్థాయి కమిటీ 'మోడల్ సోలార్ విలేజ్'గా గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. ఈ నిధులతో గ్రామంలోని ప్రభుత్వ భవనాల పైకప్పులపై సౌర పలకలు ఏర్పాటు చేస్తారు. కేంద్రం అందించే ప్రోత్సాహకంతో సౌర విద్యుత్తు తప్ప ఇతర అభివృద్ధికి నిధులు వాడుకొనే అవకాశం లేదు.

**అవగాహన..**

ఎంపిక చేసిన గ్రామాల్లో సౌర విద్యుత్తుపై అవగాహన కల్పిస్తారు. ప్యానెళ్ల ఏర్పాటుకు 2 కిలోవాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్స్‌కు రూ.78 వేల రాయితీ ఉంటుంది. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల్లో రుణం తీసుకొనేలా ప్రోత్సహిస్తారు. స్వశక్తి సంఘాల సహకారంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఎంపిక..** ఐదు వేల జనాభా కలిగిన గ్రామాలను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఎంపిక చేస్తారు. సోలార్ పలకల ఏర్పాటుకు ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి. రెడ్కో అనుమతి పొందిన సంస్థలు మాత్రమే ప్యానెళ్లు తీసుకోవాలి. పాండు రంగారావు, రెడ్కో, ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

# ఆత్మలకూ రేషన్ బియ్యం



చొప్పదండి : చొప్పదండిలోని ఓ వ్యక్తి మరణించి ఆరేళ్లు అవుతుంది. ఆయన తండ్రి సైతం నాలుగేళ్ల కిందట మృతి చెందారు. అయినా నేటికీ వారిద్దరి పేర్ల మీద కుటుంబ సభ్యులు రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అయిదేళ్ల కిందట ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అయినా ఆ కుటుంబం నెలనెలా రేషన్ బియ్యం లబ్ధి పొందుతూనే ఉంది. చొప్పదండికి చెందిన గంగారెడ్డి అనే వ్యక్తి ఆరేళ్ల కిందట, భూమయ్య అనే వ్యక్తి 2022లో, లక్ష్మి అనే వృద్ధురాలు మూడేళ్ల క్రితం మృతి చెందారు. కానీ నేటికీ వీరి పేర్ల మీదుగా బియ్యం పంపిణీ జరుగుతోంది.

సాధారణంగా రేషన్ దుకాణం పరిధిలో ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తి పేరును తొలగిస్తారు. ఓ కుటుంబంలోని సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం వస్తే రేషన్ కార్డు రద్దు చేస్తారు. కానీ నాలుగైదేళ్లుగా ఈ ప్రక్రియ సరిగా జరగకపోవడంతో వారి పేర్లు అలాగే కొనసాగుతున్నాయి. సంబంధిత కుటుంబాలు ప్రతి నెలా బియ్యం అందుకుంటూనే ఉన్నాయి. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు సైతం వీటిపై దృష్టి సారించడంలేదని తేటతెల్లమవుతోంది. వారి పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది.

**ఇలా జరగాల్సింది..**

గతంలో జిల్లా, మండల రెవెన్యూ అధికారులు రేషన్ డీలర్ల నుంచి ఎప్పటికప్పుడు మృతుల, ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వివరాలు అడిగేవారు. కానీ కరోనా విపత్తు సమయం నుంచి ఆ వివరాలు అడగకపోవడంతో వారి పేర్లు, కార్డులు అలాగే కొనసాగుతున్నాయి. ఆ వివరాలు సమర్పిస్తే డీలర్‌కు వచ్చే కోటా బియ్యం తగ్గిపోవడంతో కమీషన్ తగ్గిపోతుంది.

గ్రామపంచాయతీల్లో మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నప్పుడు.. అక్కడి నుంచి మృతుల వివరాలు సేకరించి, రేషన్‌తోపాటు పింఛన్లు తొలగించేవారు. కానీ ప్రస్తుతం ఈ ప్రక్రియ మొత్తం మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో జరుగుతుండటంతో వివరాలు తెలియకుండా పోతోంది.

మృతుల వివరాలు తొలగిస్తాం

మృతుల వివరాలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సేకరించి వారి పేర్లను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఈ-కేవైసీ ప్రక్రియను కూడా శతశాతం పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

పూర్తికాని ఈ-కేవైసీ ప్రక్రియ

రేషన్‌కార్డులో మృతుల వివరాలు తొలగించేందుకు, పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం ఈ-కేవైసీ విధానానికి శ్రీకారం చుట్టింది. రేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరూ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని మొదట్లో హడావుడి చేశారు. రెండుసార్లు గడువు కూడా పెంచారు. అయినా ఇంకా చాలామంది చేసుకోలేదు.

వేలిముద్రలు పడని కొంతమందికి వెసులుబాటు కల్పించారు. వారు ఓటీపీ చెబితే సరిపోతుంది. దీనిని ఆసరాగా తీసుకొని మృతుల కుటుంబాలు చనిపోయిన వారి పేరిట బియ్యాన్ని తీసుకుంటున్నాయి. చొప్పదండి మండలంలో 33 రేషన్ దుకాణాల్లో కనీసం వందకు పైగా మృతులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలా జిల్లా పరిధిలో 566 రేషన్ దుకాణాలు ఉండగా సుమారు 20 వేల వరకు మరణించిన వారి పేర్లు ఉండే అవకాశాలున్నాయి.

# ఆరంభానికి మీనమేషాలు.. అవస్థల్లో రోగులు




వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి ఏడాది కావస్తోంది. ప్రారంభించటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా పాత భవనం సరిపోక అవస్థలు తప్పడంలేదు. 2024 మేలోనే ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత శాసన సభా సమావేశాలు జరుగుతున్నాయని, ఎన్నికల కోడ్ కారణంగా దాటవేశారు. ఈనెల 23న ప్రారంభిస్తారన్న మరోసారి ప్రచారం జరిగింది. అది కూడా వాయిదా పడింది.

**డాక్టర్లు కూర్చునేందుకూ స్థలం లేదు**

ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి ఉపయోగంలోకి తెస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం కొనసాగుతున్న పాత ఆసుపత్రిలో డాక్టర్లకు కూర్చోవడానికి కూడా సరియైన స్థలం లేదు. దీనికితోడు రోగులు, వారితోపాటు వచ్చే సహాయకులు తలదాచుకోవాలంటే సరైన వసతి లేక చుట్టు పక్కల ప్రాంతాలను, హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రత్యేక వైద్య సేవలకు వీలు: కొత్తగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తే జిల్లా వాసులకు మెరుగైన సేవలు అందుతాయి. బస్‌స్టాండ్ రోడ్డు మార్గంలో ఉన్న ఆసుపత్రిని ఇక్కడికి తరలిస్తారు. ప్రధానంగా ప్రత్యేక వైద్య సేవలు అందుతాయి. ఇక్కడ ఐసీయూ, వెంటిలేటర్లు గదులను ఏర్పాటు చేస్తారు. ఎముకలు, పిల్లలు, నేత్రవ్యాధులకు సంబంధించిన ప్రత్యేక సేవలను అందజేస్తారు.

**ఈనెలలో ప్రారంభిస్తాం**

జనరల్ ఆసుపత్రి భవనాన్ని ఈనెల చివర్లోగా ప్రారంభించి అన్ని రకాల సేవలను అందజేస్తాం. ఇక్కడ రోగులకు అన్ని అధునాతనమైన సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేక వైద్య సేవలు ఇక్కడ కొనసాగుతాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు అవసరమైతేనే హైదారబాద్‌కు సిఫారసు చేస్తాం. డాక్టర్ రాంచంద్రయ్య, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్.

అన్ని సదుపాయాలు ఉన్నాయంటున్నారు

ప్రస్తుతం కొనసాగుతున్న ఆసుపత్రిలో సౌకర్యాలు లేక రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. భవనంలో అన్ని సదుపాయాలను కల్పించారని చెబుతున్నారు. ఇంక ఆలస్యం ఎందుకు. వెంటనే ప్రారంభించాలి. డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు.

# హరిత లక్ష్యం.. కార్యాచరణ సిద్ధం



కోరుట్ల : ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014 నుంచి పట్టణాల్లో, గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని అయిదు పట్టణాల్లో పురపాలక సంఘాల ఆధ్వర్యంలో వన మహోత్సవం చేపట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా వన నర్సరీలను ఏర్పాటు చేసి ఏటా కూలీలతో ప్రత్యేకంగా మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. జిల్లా అధికారులు ప్రతి పట్టణంలో విస్తృతంగా మొక్కలు నాటించేందుకు ప్రత్యేక లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పట్టణ ప్రగతి నర్సరీల్లో లక్షల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. లక్ష్యం అందుకునేందుకు సరిపడా మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో మొత్తం 7,81,200 మొక్కలను నాటాలని లక్ష్యం కేటాయించారు. పట్టణ నర్సరీల్లో 5,35,300 మొక్కలు అందుబాటులో ఉన్నట్లు బల్దియా అధికారులు తెలిపారు.

**పట్టణ నర్సరీల్లో విరివిగా పెంపకం**

గతంలో పట్టణాల్లో నర్సరీలు అందుబాటులో ఉండేవి కావు. చుట్టుపక్కల గ్రామాల్లోని పల్లె వన నర్సరీల్లో పెంచిన మొక్కలు తీసుకువచ్చి నాటేవారు. ఇవి సరిపోకపోవడంతో ప్రైవేటు నర్సరీల నుంచి లక్షల రూపాయలను వెచ్చించి మొక్కలను కొనుగోలు చేసి తెచ్చి పట్టణ ప్రజలతో నాటించేవారు. నాలుగేళ్ల క్రితం ప్రతి పట్టణంలో పట్టణ ప్రగతి నిధులను వెచ్చించి వన నర్సరీలను ఏర్పాటు చేశారు. అందులోనే ఆయా పట్టణాల్లోని రోడ్లకిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో నాటేందుకు, ఇళ్లలో ప్రజలతో నాటించేందుకు కావాల్సిన పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. పట్టణ నర్సరీల్లో ఏడాదంతా మొక్కలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. నాణ్యమైన మొక్కల కోసం పురపాలక సంఘం ఆధ్వర్యంలో తయారు చేసిన సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు.

**వివిధ రకాలు సిద్ధం**

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పురపాలికల్లోని పట్టణ నర్సరీల్లో కేటాయించిన లక్ష్యం సాధించేందుకు కావాల్సిన అన్ని రకాల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇప్పటికే నర్సరీల్లో వేల సంఖ్యలో మొక్కలు ఏపుగా పెరిగి సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఇంటికి 2 నుంచి 5 వరకు పూల, పండ్ల మొక్కలను ఏటా పంచుతున్నారు. రహదారులకు ఇరువైపులా నాటేందుకు నాలుగు, అయిదు అడుగుల ఎత్తు గల మొక్కలను ప్రత్యేకంగా పెంచుతున్నారు. మల్లెపువ్వు, గులాబి, మందార, గోరింటాకు, చామంతి, తులసి, పారిజాతం, కోనోకార్పస్, జామ, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, చింత, వేప, గుల్‌మోహర్, చైనాబాదం, కానుగ, బాదాం, మారేడు, సెల్లోఫాం, టేకొమా, టేకు, నీలగిరి ఇలా సుమారు 35 రకాల మొక్కలను విరివిగా పెంచుతున్నారు.

# కరెంట్ దొంగలపై కన్ను..!

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న విద్యుత్తు చౌర్యంపై డిటెక్షన్ ఆఫ్ పెరిఫెరల్ ఆఫ్ ఎనర్జీ(డీపీఈ) విభాగం అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. చౌర్యం నియంత్రణ విభాగంతో పాటు స్థానిక విద్యుత్తు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నప్ప టికీ.. అక్కడక్కడా కొందరు ఇంకా అక్రమంగా విద్యుత్తును వినియోగించుకుంటూ చౌర్యానికి పాల్పడుతున్నారు.

విద్యుత్తు చౌర్యంపై మార్చి 2024 నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా డీపీఈ అధికారులు 2,703 కేసులు నమోదు చేసి రూ.4.61 కోట్లు, స్థానిక విద్యుత్తు అధికారులు 1217 కేసులు నమోదు చేసి రూ.15 లక్షల జరిమానా విధించారు.

ప్రతి నెలా రూ.10 లక్షల జరిమానా విధించే లక్ష్యం ఉన్నప్పటికి విస్తృతంగా తనిఖీలు చేపట్టి లక్ష్యానికి మించి జరిమానా విధించడం, కేసులు నమోదు చేయడం గమనార్హం.

వ్యవసాయ క్షేత్రాల్లో ఫాంహౌజ్‌లు నిర్మించి పలువురు, ఉద్యానవనాలు అభివృద్ధి చేసి, గొర్రెలు, చేపల పెంపకం చేపట్టి ఉచిత వ్యవసాయ



కనెక్షన్ల నుంచి విద్యుత్తు పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాత్కాలిక అవసరాల కోసం, ఇటుక బట్టీల కోసం అక్కడక్కడా విద్యుత్తు లైన్‌కు కొండీలు తగిలిస్తున్నారు.

**విద్యుత్తు చౌర్యం ఇలా...**

కొందరు డొమెస్టిక్ విద్యుత్తు కనెక్షన్ తీసుకుని కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారు. రెండింటి యూనిట్ ధరకు భారీగా వ్యత్యాసం ఉంది. మీటరు ఉన్నప్పటికీ అది తిరగకుండానే లూప్ ద్వారా విద్యుత్తు వినియోగించడం గమనార్హం. ఈ కేసుల్లో భారీగా బ్యాక్ బిల్లింగ్ పేరిట జరిమానా విధిస్తున్నారు. విద్యుత్తు లైన్‌కు కొండీలు తగిలించి వినియోగించడం, మీటర్‌లోని సాఫ్ట్‌వేర్‌ను పనిచేయకుండా ఎంతో కొంత బిల్లు వచ్చే విధంగా మీటర్‌ను సెట్ చేయడంతో విద్యుత్తు భారీగా చౌర్యం జరుగుతోంది. అనుమతి పొందిన కిలో వాట్ కన్నా ఎక్కువగా వినియోగిస్తున్న వారి నుంచి డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. డొమెస్టిక్ కనెక్షన్ ఒక కిలోవాట్ అధిక వినియోగానికి రూ.1000, కమర్షియల్‌కు రూ.2000, పరిశ్రమలకు రూ.1500 వసూలు చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**


విద్యుత్తు చౌర్యం చేయడం నేరం. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కనెక్షన్ పొంది మీటర్లు బిగించిన తదుపరి విద్యుత్తును వినియోగించాలి. చౌర్యం రుజువు అయిన పక్షంలో కేసును బట్టి జైలు, భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్తు చౌర్యాన్ని నియంత్రించేందుకు నిరంతరాయంగా తనిఖీలు చేపడుతున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో 3,920 కేసులు నమోదు చేసి రూ.4.76 కోట్లు జరిమానా వసూలు చేశాం. శ్రీనివాసులు, డీఈ, జిల్లా విద్యుత్తు చౌర్యం నియంత్రణ విభాగం

# నిధులు రావు.. సమస్యలు తీరవు

ఆసిఫాబాద్: ఉపరితల బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అడుగడుగునా అవస్థలతో సహవాసం చేస్తున్నారు. రోడ్లులేక, తాగునీటి ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రెండేళ్ల నుంచి డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్) నిధులు రావడం లేదు. మరోవైపు వచ్చిన సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) నిధులు సైతం నేతలు తమకు నచ్చిన చోట, కాసులు మిగిలే ప్రదేశాల్లో చేపడుతున్నారు. ఉపరితల బొగ్గు గనుల ఏర్పాటుతో జిల్లాలో 25 పైగా గ్రామాలు చెల్లాచెదురయ్యాయి. కొన్ని గ్రామాలకు మాత్రమే సింగరేణి పునరావాసం కల్పించింది. గ్రామం ఉన్న ప్రాంతంలో గని తవ్వితేనే పునరావాసం కల్పిస్తున్నారు. గ్రామం పక్కనుంచే తవ్వకాలు సాగుతున్నా, వందల మీటర్ల లోతు నుంచి బొగ్గును వెలికితీసే క్రమంలో వెలువడే వ్యర్థాలు, పేలుళ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నా, పునరావాసం గురించి అధికారులు పెదవి విప్పడం లేదు. కొన్నిచోట్ల రెండు, మూడు సార్లు సైతం గ్రామాలు గనుల తవ్వకాలతో మరోచోటుకు తరలిపోయే పరిస్థితి ఏర్పడింది.

**తీరని వేదన..**

తిర్యాణి, ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల సరిహద్దులో ఉన్న కైరిగూర ఉపరితల గని 1600 హెక్టార్లలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ గనిని ఆనుకునే తోయగూడ, చందుగూడ, కొలాంగూడ, గోండుగూడతోపాటు, మరో అయిదు గ్రామాలు ఉన్నాయి. గనుల్లో పేలుళ్లకు పెంకుటిల్లు పగుళ్లు తేలుతున్నాయి. మరమ్మతులు చేసుకుని నివాసాలు



ఏర్పాటు చేసుకుంటున్నారు. దాదాపు ఆరువందల జనాభా ఈ గ్రామాల్లో ఉంది. పాత దంతన్‌పల్లి, గోవర్‌గూడతోపాటు గని పక్కనే ఉన్న మరో నాలుగు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. వీరంతా పక్కనే ఉన్న చెలమల నీరు తెచ్చుకుంటున్నారు. ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉల్లిపిట్ట డోర్లి, ఇందిరానగర్, దంతన్‌పల్లిలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదు. రెబ్బెన మండలంలోని సోనాపూర్‌లో అయిదేళ్ల కిందట సింగరేణి తవ్వకాలు చేపట్టడంతో.. 45 కుటుంబాలు మరోచోట స్థలం కొని ఇళ్లు నిర్మించుకున్నారు. విద్యుత్తు, తాగునీరు, పాఠశాల వసతిని కల్పించారు. తాజాగా మళ్లీ ఈ గ్రామం వద్ద గోలేటి ఉపరితల గని ఏర్పాటులో భాగంగా తవ్వకాలు చేపట్టనున్నారు. దీంతో మళ్లీ నిరాశ్రయులుగా మారనున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పరిహారం చెల్లింపుల్లో ఓ సర్పంచి చేతివాటం ప్రదర్శించి, బాధితులకు మంజూరైన చెక్కులను తన ఖాతాలో వేసుకున్నారు.

ఇళ్లకు బీటలు వారుతున్నాయి పూసం తిరుపతి, మడావి హనుమంత్‌రావు, తోయగూడ-తిర్యాణి పేలుళ్లతో ఇళ్లకు బీటలు వస్తున్నాయి. ఏటా మరమ్మతులు చేసుకుంటున్నాం. గని చుట్టుపక్కల ఉన్న పదుల సంఖ్యల్లోని గ్రామాల్లో ఒక్కో చేతి పంపే తాగునీటి అవసరాలు తీర్చుతోంది. మా ఇద్దరికీ కిడ్నీ ఆపరేషన్లు జరిగాయి. మరికొందరు కిడ్నీ వ్యాధులతో బాధపడు తున్నారు.

జిల్లాకు వచ్చిన డీఎంఎఫ్‌టీ నిధులు: రూ.125 కోట్లు

చేపట్టిన పనులు: 2,586సీఎస్ఆర్ నిధులు: రూ.3 కోట్లు

# చెరువుల పునరుద్ధరణకు అమృత్ నిధులు

రాయికల్ : రాష్ట్రవ్యాప్తంగా పురపాలికల పరిధిలోని చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా పురపాలిక పరిధిలోని చెరువుల్లో చెత్తాచెదారం తొలగింపు ఇతర పనులకు ఒక్కో చెరువుకు రూ.3.15 కోట్లు నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని జగిత్యాల పురపాలిక పరిధిలో మోతె చెరువు, చింతకుంట చెరువు, రాయికల్ పరిధి పెద్దచెరువు, ధర్మపురి పరిధి కొండ్రపల్లి, కోరుట్ల పరిధి తాళ్ల చెరువు, మెట్‌పల్లిలో పెద్ద చెరువును గుర్తించారు. ఆరు చెరువుల పునరుద్ధరణకు 18.90 కోట్లు విడుదల చేయగా టెండరు దశలో ఉన్నాయి.

**పదేళ్ల అనంతరం పనులు**

తెలంగాణ ప్రభుత్వ ఆవిర్భావం అనంతరం చెరువుల్లో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టారు. మళ్లీ పదేళ్ల అనంతరం పురపాలికల్లో చెరువుల పునరుద్ధరణకు నిధులు కేటాయించారు. పురపాలికల్లోని చెరువుల్లో అధికంగా పట్టణంలోని మురుగు నీరు చేరడం, గుర్రపు డెక్క, నాచు పెరగడం, చెత్తాచెదారంతో నిండి కంపు కొడుతున్నాయి. దీనికి తోడు కొందరు అక్రమంగా మట్టిని ఇష్టానుసారం తీయడంతో గుంతల మయంగా మారి ప్రమాదాలు



జరుగుతున్నాయి. గతంలో నిర్మించిన చెరువు కట్టలు సైతం కోతలకు గురయ్యాయి. ఈ నిధులతో చెరువుల మరమ్మతులు తదితర పనులు చేపట్టనున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..**

అమృత్ 2.0 పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణకు పురపాలిక ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో నివేదికలు తయారు చేసి పంపగా నిధులు మంజూరయ్యాయి. ఒక్కో చెరువుకు కేంద్ర నిధులు 1.43 కోట్లు, రాష్ట్ర నిధులు 1.43 కోట్లు మిగతా నిధులు 28.60 లక్షలు ఆయా పురపాలిక నిధుల నుంచి వెచ్చించనున్నారు. ప్రస్తుతం టెండర్ల దశలో ఉండగా తొలిసారి గుత్తేదార్లు ముందుకు రాకపోవడంతో మరోసారి టెండర్లు పిలవనున్నారు. టెండర్ల దశ పూర్తయితే పురపాలికల్లోని చెరువులకు జీవకళ రానుంది.

# ప్రతిపాదనలకు ఆదేశం.. అభివృద్ధికి అవకాశం

జగిత్యాల : జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూముల్లో అభివృద్ధి ఆశలు రేకెత్తిస్తున్నాయి. 437 సర్వే నంబరులో దాదాపు 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా కొంత భూమిని అర్హులైన పేదలకు పట్టాలు అందజేశారు. మరికొంత భూమిపై కొందరు అక్రమ పట్టాలు పొందారు. మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి చొరవతో ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 300 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తుండగా పట్టణానికి అత్యంత సమీపంలో ఉండటంతో ప్రస్తుతం ఇక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆలోచన చేస్తున్నారు. ఇదే విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి నివేదించగా ప్రతిపాదనలు పంపాలని సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు.

**ఇలా చేస్తే మేలు**జగిత్యాల పట్టణంలో కలిసిన టీఆర్‌నగర్ గ్రామంలో దాదాపు 10 వేల మంది నివసిస్తున్నారు. నూకపల్లి అర్బన్ కాలనీలో 4 వేల ఇళ్లల్లో జనం నివాసం ఉంటే మరో 20 వేల మంది ఇక్కడ నివసించే అవకాశం ఉంది.ఇక్కడే న్యాక్ కేంద్రం కూడా ఉంది. ఇక్కడికి చేరాలంటే రహదారి సరిగా లేదు. టీఆర్‌నగర్ మీదుగా న్యాక్ సెంటర్, ఇందిరమ్మ కాలనీకి రెండు వరుసల రహదారి నిర్మిస్తే రాకపోకలకు ఉపయోగకరంగా ఉండటంతోపాటు ఈ ప్రాంతంలో చేపట్టబోయే అభివృద్ధికి ఉపయోగపడనుంది.జగిత్యాలలో మినీ స్టేడియం తప్ప మరో స్థలం లేదు. ఏదైనా సభ నిర్వహణ చేపట్టాలన్నా, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు, సభల ఏర్పాటుకు ఉపయోగకరంగా ఉండనుంది.యూనివర్సిటీ, గురుకుల పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాలతోపాటు పలు కార్యాలయాలు ఏర్పాటు చేసినా ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంది.

# బిక్కేరు బెంగ..తీర్చేదెవరో..!

మోత్కూరు : అడ్డగూడూరు మండలం జానకిపురం- తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామాల మధ్య బిక్కేరుపై వంతెన నిర్మించాలని ఇక్కడి ప్రజలు ఎంతో కాలంగా కోరుతున్నారు. దీని నిర్మాణంతో నల్గొండ జిల్లా ప్రజలు వరంగల్‌కు వెళ్లేందుకు సుమారు 60 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. నల్గొండ ప్రజలు నకిరేకల్, అడ్డగూడూరు మీదుగా వెళ్లేందుకు ఇటీవల మానాయికుంట- గురజాల మధ్య మూసీనదిపై వంతెన ప్రారంభమైంది. ఈ వంతెన నుంచి జానకిపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఇటీవల స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ పనులు ప్రారంభించారు. అడ్డగూడూరు మీదుగా చౌళ్లరామారం, జానకిపురం నుంచి తాటిపాముల మీదుగా పాలకుర్తి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ ద్వారా వరంగల్ వెళ్లేందుకు ఇది దగ్గర దారి అవుతుంది. ప్రస్తుతం రోడ్డు సౌకర్యంగా ఉన్నప్పటికీ బిక్కేరుపై వంతెన లేక నల్గొండ ప్రజలు సూర్యాపేట మీదుగా అటు తొర్రూరు, ఇటు తిరుమలగిరి, పాలకుర్తి లేదా జనగామ నుంచి తిరిగి వరంగల్ వెళ్లాల్సి వస్తుంది.

తాటిపాముల-జానకిపురం మధ్య బిక్కేరుపై వంతెన నిర్మించాలని 1999లో తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన సంకినేని వెంకటేశ్వర్‌రావు 2000లో సర్వే చేయించారు. చెక్‌డ్యామ్‌తోపాటు వంతెన నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాటిపాముల వైపు గడ్డోలు కర్ర నుంచి జానకిపురం అవతలిగట్టు వరకు 260 మీటర్ల దూరం వంతెన నిర్మించాల్సి ఉంటుందని ఇంజినీర్లు అంచనా వేశారు. ఇటీవల నీటి పారుదలశాఖ ధికారులు మళ్లీ సర్వే చేశారు. తాటిపాముల నుంచి వస్తకొండూరు వైపు వంతెన, చెక్‌డ్యామ్ నిర్మించాలన్న స్థానిక రైతుల అభ్యర్థన మేరకు ఈ సర్వే చేశామని నీటి పారుదలశాఖ డీఈఈ సత్యనారాయణగౌడ్‌కు తెలిపారు.రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వస్థలం తిరుమలగిరి మండలం తాటిపాముల. ఆయన స్వగ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న తలంపుతో ఈ వంతెన, చెక్‌డ్యామ్ నిర్మించేందుకు రూ.16 కోట్లు మంజూరు చేయడంతోపాటు ఆ పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. ఇదే రోజు తాటిపాముల గ్రామంలో పలు సిమెంట్ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, 500 మంది మహిళలకు కుట్టుమిషన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొననున్నారు.

# కట్టుకథలు..కల్లబొల్లి కబుర్లు



హైదరాబాద్: కేపీహెచ్‌బీ వసంత్‌నగర్‌లోని ఓ ఇంట్లో కాపలాదారుగా పనిచేస్తున్న వ్యక్తి తన భార్య నిద్రిస్తున్న సమయం చూసి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడు కొట్టేశాడు. తప్పు తన మీదకు రావొద్దని ఉదయాన్నే దొంగ వచ్చి ఎత్తుకెళ్లాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు ఇంటిలోకి కొత్త వ్యక్తులు రాలేదని గుర్తించి అతడిని ప్రశ్నించగా తానే చోరీ చేశానని అంగీకరించాడు.

ఎంఎంటీఎస్ రైల్లో తనపై ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించినట్లు యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు దాదాపు నెల రోజులు దర్యాప్తు చేశారు. దాదాపు 100 మంది అనుమానితుల్ని ప్రశ్నించి 250 సీసీ ఫుటేజీలను పరిశీలించారు. చివరకు యువతి రీల్స్ చేస్తూ కిందపడ్డట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

తప్పుడు ఫిర్యాదులతో పోలీసులను కొందరు ముప్పుతిప్పలు పెట్టిస్తున్నారు. దొంగతనం జరగకున్నా జరిగిందని.. వ్యక్తిగత కారణాలు, ఆర్థిక సమస్యలు, ఇతరుల్ని కటకటాల్లోకి నెట్టాలని ఇలా వేర్వేరు కారణాలతో ఫిర్యాదులు చేస్తున్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టడం.. రోజుల తరబడి దర్యాప్తు చేశాక.. ఒట్టిదేనని తేలడంతో ఉసూరుమంటున్నారు. ఎందుకిలా చేశావంటే పొరపాటు జరిగిందని ఫిర్యాదుదారులు నాలుక మడతేస్తున్నారు. లైంగిక వేధింపులు, దొంగతనం వంటి తీవ్ర నేరాల్లోనూ తప్పుడు సమాచారం ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది. అసలే సిబ్బంది కొరత, బందోబస్తు విధులు, పని ఒత్తిడి భారంతో సతమతమయ్యే పోలీసులకు ఈ తరహా ఫిర్యాదులు సవాలుగా మారుతున్నాయి.

**జైలు శిక్ష, జరిమానా తప్పవు**

పోలీస్‌స్టేషన్‌కు ఒక ఫిర్యాదు వచ్చినప్పుడు నేర తీవ్రతను బట్టి సిబ్బందికి పనులు అప్పగిస్తారు. తీరా తప్పుడు ఫిర్యాదని తేలినప్పుడు సిబ్బంది పడ్డ శ్రమ వృథా అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పోలీసుల్ని తప్పు దోవ పట్టించడం, ఇతర ఉద్దేశాలతో నకిలీ ఫిర్యాదు చేసినవారి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసే అధికారముంది. ఈ కేసుల్లో గరిష్టంగా ఏడాది జైలు, రూ.10 వేల జరిమానా విధించొచ్చు. కానీ పోలీసులు మానవతా దృక్పథంతో కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు.

**బాంబు బెదిరింపులతో సమస్య**

నగరంలోని 3కమిషనరేట్లలో ఏటాసగటున 5% తప్పుడు ఫిర్యాదులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పర్యాటక ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలకు బాంబు బెదిరింపు కాల్స్ నుంచి ఠాణాలకు వచ్చే ఫిర్యాదుల వరకూ ఈ కోవలోనివే. ముఖ్యంగా భార్యాభర్తల గొడవల్లో వచ్చే ఫిర్యాదుల్లో సగానికిపైగా నకిలీవే. ఇటీవల పేట్‌బషీరాబాద్ ఠాణా పరిధిలో హత్య జరిగిందని డయల్ 100కు ఫిర్యాదు అందగా పోలీసులు హుటాహుటిన అక్కడికెళ్లగా ఉత్తదేనని తేలింది. ఇలా వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. ఈప్రభావం ఇతరకేసుల దర్యాప్తుపై ప్రభావం పడుతోందని పోలీసులు వాపోతున్నారు.

**అలా చేస్తే సమయం వృథా..**

పోలీసులకు ఫిర్యాదు చేసేటప్పుడు నిజం చెబితే సత్వర న్యాయం దక్కుతుంది. తప్పుడు ఫిర్యాదులతో విలువైన సమయం వృథా అవడంతో పాటు ఇతర కేసుల దర్యాప్తుపై ప్రభావం చూపిస్తుంది. కొన్నిసార్లు దర్యాప్తు మొదలయ్యాక తప్పుడు సమాచారం, వ్యాఖ్యలతోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ

# కన్నేశారు.. కట్టేశారు



హైదరాబాద్: అధికారుల ఉదాసీనతను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ జాగా ఖాళీగా కనిపిస్తే తమ పరం చేసుకుంటున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి రాత్రికిరాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రశ్నించేందుకు వచ్చినవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికారులూ చోద్యం చూస్తుండటంతో వారు ఆడిందే ఆటగా సాగిపోతోంది. తాజాగా బండ్లగూడ మండలం సుల్తాన్‌బాగ్‌లోని పంచలింగాల దేవాలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయి.

**రూ.38 కోట్ల విలువైన భూమి...**

సుల్తాన్‌బాగ్‌లోని సర్వేనంబర్ 6లో 3.14 ఎకరాల ఆలయ భూమి కబ్జాకు గురైంది. పంచలింగాల దేవాలయం భూమిలో కబ్జాకోరులు బహుళ అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టారు. రూ. కోట్లు విలువైన ఎండోమెంట్ భూమి కబ్జాకు గురైందని వానరసేన దేవాదాయశాఖ అధికారికి తొలుత ఫిర్యాదు చేసింది. దీంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఫిబ్రవరి 15న స్థానిక తహసీల్దార్‌కు, అసిస్టెంట్ సిటీప్లానర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ 8, సౌత్‌జోన్‌కు ఎండోమెంట్ అధికారి లేఖ రాశారు. ఛత్రినాక ఠాణాలోనూ ఫిర్యాదు చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూమిలో అక్రమనిర్మాణాలు చేపట్టడం వెనక అధికారుల హస్తం ఉందంటూ వానరసేన ఆరోపిస్తోంది. కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలున్నాయి. స్థానికంగా ఎకరం సుమారు రూ.12కోట్లు పలుకుతుండగా రూ.38కోట్ల వరకు ఆలయ భూమిని కబ్జాకోరులు గుటకాయస్వాహా చేసినట్టు తెలుస్తోంది. ఎండోమెంట్ అధికారులు 30/87 చట్టం ప్రకారం దేవుని మాన్యాన్ని కాపాడి అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉన్నా.. ఆ మేరకు వ్యవహరించడంలేదన్న ఆరోపణలున్నాయి.

**ఆలయభూమిపై భిన్న వాదనలు..** ఆలయ భూమి ఆక్రమణలపై హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ కమిషనర్ టి.శేఖర్‌ను వివరణ కోరగా.. అన్యాక్రాంతంపై సర్వే చేపట్టాలని అధికారులకు లేఖరాసినట్లు తెలిపారు. 3.14 ఎకరాల్లో 300గజాల్లోనే ఆలయభూమి ఉందని తెలిపారు. అది కూడా దేవాదాయశాఖకు చెందిందికాదని.. ప్రభుత్వ భూమని స్పష్టం చేశారు. అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు, బాధ్యులైన ఇతర అధికారులకు లేఖ రాసినట్లు వెల్లడించారు.

**కోరల్లేని చట్టంతో కాపాడేదెలా..?**

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చేపడితే రెవెన్యూ అధికారులు పొక్లెయిన్లతో కూల్చేస్తారు. ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగిస్తారు. దేవాలయభూములను కబ్జాచేస్తే నోటీసుల జారీకే సంబంధిత అధికారాలు పరిమితమవడంతో ఆక్రమణలను అడ్డుకోలేని పరిస్థితి ఉందన్న విమర్శలున్నాయి. హైడ్రా తరహాలో అధికారాలు కట్టబెడితే అక్రమార్కుల వెన్నులో వణుకుపుడుతుందన్న అభిప్రాయాలువ్యక్తమవుతున్నాయి.

# దస్త్రం పదిలం.. హక్కు భద్రం

వికారాబాద్: భూ దస్త్రాల నిర్వహణలో పారదర్శకత, భూ సమస్యల పరిష్కారాల నిమిత్తం ఆర్వోఆర్ చట్ట-2020 ధరణి స్థానంలో నూతన రెవెన్యూ చట్టం భూ భారతి-2025ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో గత ఐదారేళ్లుగా నిషేధిత భూముల జాబితా, పార్ట్-బి భూములు, మిస్సింగ్ సర్వే నంబర్లు, పేర్ల మార్పు, భూ హక్కులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ లాంటి అపరిష్కృత సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు పైలట్ మండలాల్లో అమలు చేస్తుండగా, త్వరలో అన్ని మండలాలకు విస్తరించనున్నారు.

**సాదాబైనామాలకు పరిష్కారం..**

కొత్త చట్టంతో సాదాబైనామాలకు పరిష్కారం లభించనుంది. పీఓటీ, సీలింగ్, ఎల్‌టీఆర్ చట్టాల ఉల్లంఘన లేదని నిర్ధారించుకుంటారు. 2014 జూన్‌లోగా సాదాబైనామాల ద్వారా భూ క్రయవిక్రయాలు జరిపిన రైతులకు చట్టబద్ధత కలుగనుంది. జిల్లాలో 11 వేల సాదాబైనామాల దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. జిల్లాలో సరైన దస్త్రాలు లేని వివాదాస్పద భూములు దాదాపు 15 వేల ఎకరాల భూములను ప్రభుత్వం పార్ట్‌బీలో చేర్చింది.

**కొలత చేసి.. పటం గీశాకే రిజిస్ట్రేషన్..:** ఇప్పటి వరకు పాసు పుస్తకం ఉండి, ధరణిలో స్లాట్ నమోదు చేసుకుంటే చాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేది. నూతన చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. ఎవరైనా రైతు తన భూమిని విక్రయించాలనుకుంటే ముందుగా భూమిని క్షేత్రస్థాయిలో కొలత చేసి, భూమి తాలూకా పటం(మ్యాప్) గీసి తహసీల్దారుకు సమర్పించాల్సి ఉంటుంది.

**కొలిక్కిరాని 18 వేలకు పైగా దరఖాస్తులు**




మ్యుటేషన్లు, వారసత్వ బదిలీ, నాలా కన్వర్షన్, సక్సేషన్, పీవోబీ, పాసు పుస్తకాల్లో తప్పుల సవరణ, కొత్త పాసు పుస్తకాల జారీ తదితరాలకు సంబంధించి జిల్లాలో 18 వేలకుపైగా దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిని గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి జూన్ నెలాఖరు నాటికి పరిష్కరించే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

**ఆర్డీఓ స్థాయిలోనే..**

ధరణి పోర్టల్‌లో 35 రకాల ఐచ్ఛికాలను పొందుపరిచినా, సమస్యల పరిష్కారం కాలేదు. వీటన్నింటికీ ఆర్డీఓ స్థాయిలోనే పరిష్కారం లభించనుంది.

# శివ శివా.. ఏమిటీ గోస

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో కోడెలపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. కోడె మొక్కుల ద్వారా ఆలయానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ వాటి సంరక్షణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా కోడెలు అనారోగ్యం బారిన పడటం, మరికొన్ని మృత్యువాత పడటం జరుగుతూనే ఉంది. రాజన్న ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. కోరిన కోర్కెలు తీరితే కోడె మొక్కు చెల్లించుకుంటామని భక్తులు వేడుకుంటారు. మరి కొంత మంది భక్తులు ఇంటివద్ద పెంచిన నిజ కోడెలను తీసుకువచ్చి స్వామివారికి మొక్కు చెల్లించుకుంటారు. భక్తులు సమర్పించే కోడెలను ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. ఆలయంలో తిరిగే కోడెలు, ఆవులను ఆలయం సమీపంలోని కట్టకింద గోశాలలో సంరక్షిస్తుంటారు. వీటి సంరక్షణకు ఏటా రూ.50 లక్షలకు పైగా వెచ్చిస్తుంటారు. ఎండుగడ్డి, పచ్చిమేత, దాణా అందిస్తూ ఎండ వేడిమి



తగలకుండా చర్యలు చేపడుతున్నా అవి అనారోగ్యం పాలవడం, ఇటీవల మృత్యువాత పడటం ఆందోళన కలిగించే విషయం.

**పంపిణీ నిలిచిపోయి.. సంఖ్య పెరిగి...**

కొంత కాలంగా తిప్పాపూర్ గోశాల నుంచి రైతులకు కోడెల పంపిణీ నిలిచి పోవడంతో గోశాలలో వాటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. గత ఏడాది మూడు విడతల్లో దాదాపు 1975 కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. ఇందులో వరంగల్ జిల్లా గీసుకొండకు చెందిన ఓ రైతుకు పంపిణీ చేసిన 60 కోడెల్లో కొన్ని పక్కదారి పట్టడంతో అప్పటి నుంచి పంపిణీ జరగలేదు. అర్హులైన రైతులు వీటికోసం చేసిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెసుస్తోంది.

**పెద్దవి, చిన్నవి విభజన చేయకనే...**

ప్రసుత్తం గోశాలలో దాదాపు వెయ్యి వరకు పెద్ద, చిన్న, మధ్యస్థాయి కోడెలున్నాయి. ఇందులో చిన్న వాటిని వేరుచేసి ప్రత్యేక షెడ్డులో సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు అన్నింటినీ ఒకే ప్రాంతంలో ఉంచుతున్నారు. అనారోగ్యానికి గురైన కోడెలను ప్రత్యేక షెడ్డులో వేసి వైద్యం అందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కింద పడిన చిన్న కోడెలను మిగతా కోడెలు తొక్కుకుంటూ వెళ్లడంతో అవి అనారోగ్యం పాలై మృత్యువాత పడుతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. మృతి చెందుతున్న కోడెలను గుట్టు చప్పుడు కాకుండా తీసుకెళ్లి మూలవాగు ప్రాంతంలో సిబ్బంది పూడ్చి వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సంరక్షణకు చర్యలు తీసుకుంటాం**

గోశాలలోని కోడెల్లో చిన్న వాటిని వేరు చేసి సంరక్షించాల్సి ఉంది. భక్తులు పాలు మరువని కోడెలను స్వామివారికి సమర్పించేందుకు తీసుకువస్తున్నారు. వాటిని స్వీకరించేందుకు తిరస్కరిస్తున్నా ఇక్కడే వదిలి వెళుతున్నారు. వాటిని గోశాలకు తీసుకువచ్చి సంరక్షించాల్సి వస్తోంది. కోడెల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతాం.
శ్రీనివాస్, ఏఈవో రాజన్న ఆలయం

# నిమ్మ.. కన్నీటి చెమ్మ..!

నకిరేకల్: నిమ్మ సాగుతో ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన రైతులు ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయారు. గత ఆదివారం బలమైన ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వర్షం నిమ్మతోటల్లో బీభత్సాన్ని సృష్టించింది. నష్టం రూ.కోట్లలోనే ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఆరు రోజుల నుంచి ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిమ్మ రైతులకు జరిగిన నష్టాలపై అంచనాలు రూపొందిస్తున్నారు. ప్రభావిత గ్రామాలను ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారుల బృందంతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ సాయాన్ని అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వరి, పత్తి, ఇతర పంటలు ఈ సీజన్‌లో దెబ్బతింటే మళ్లీ వచ్చేసీజన్‌లో సాగుచేసుకునే వీలుంటుంది. నిమ్మ ఒకసారి నాటితే 30-40 ఏళ్ల వరకు దిగుబడులు ఇస్తుంది. చాలా చోట్ల పది, ఇరవై ఏళ్లు పెంచిన నిమ్మచెట్లు తోటల్లో



నేలకొరిగాయి. 1,044 ఎకరాల్లోని 1.04 లక్షల నిమ్మచెట్లకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అంచనాకు వచ్చారు. 1600 ఎకరాల్లో చెట్లకు కొమ్మలు విరగడం, పిందెలు రాలడం వంటివాటితో పాక్షికంగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నిమ్మ సాధారణ ధరల ఆధారంగా ఎకరాకు ఏటా రూ.3 లక్షల విలువైన పంట చేతికి అందుతుంది. నష్టం రూ.30 కోట్లకుపైగా ఉంటుందన్న అంచనాలున్నాయి.

**ఆన్‌లైన్‌లో నమోదు లేక..**

వరి, పత్తి పంట విక్రయాల సమయంలో ఆయా దిగుబడులకు అనుగుణంగా రైతు సాగు విస్తీర్ణం ఉండాలి. భూములు కౌలుకు తీసుకుని సాగుచేసే వారు పంట విక్రయాల సమయంలో ఇబ్బందులు ఎదురు కాకుండా నిమ్మతోటలను వరి, పత్తి సాగుకింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. నకిరేకల్ మండలంలో నిమ్మ సాగు 12 వేల ఎకరాల వరకు ఉండగా వ్యవసాయ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో మాత్రం 6వేల ఎకరాలుగా ఉండటం గమనార్హం.

ప్రస్తుతం దెబ్బతిన్న తోటల్లో 40శాతానికిపైగా ఆన్‌లైన్‌లో ఇతర పంటల పేరున నమోదు ఉండటంతో తమకు నష్ట పరిహారం రాదన్న ఆందోళన బాధిత రైతుల్లో వ్యక్తమవుతోంది. ఆన్‌లైన్ సమస్యలను వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.

**నివేదిక సిద్ధం చేస్తున్నాం..**

ఈదురు గాలులకు తీవ్రంగా దెబ్బతిన్న నిమ్మతోటల వివరాలను క్షేత్రస్థాయి పరిశీలనతో గుర్తించాం. రైతుల నుంచి కూడా నష్టం వివరాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాం. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి అందించేందుకు నివేదికను సిద్ధం చేస్తున్నాం.
ప్రవీణ్, ఉద్యాన శాఖ క్లస్టర్ అధికారి, నకిరేకల్

# ట్యాంకర్లు.. నిబంధనలకు నీళ్లు

హైదరాబాద్ : కాచిగూడలో అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఐటీ ఉద్యోగి అక్కడికక్కడే మరణించాడు. షేక్‌పేట్ సమీపంలో అపసవ్యదశలో వచ్చిన ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. అక్కడ చేరిన కొందరు ఆటోడ్రైవర్‌ను బెదిరించి వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను అక్కడ నుంచి తప్పించారు. శేరిలింగంపల్లిలోని అపార్ట్‌మెంట్‌కు మురుగు నీరు సరఫరా చేసిన ట్యాంకర్ డ్రైవర్ నిలదీసిన వారిపైనే దౌర్జన్యానికి దిగినట్టు సమాచారం.

అడ్డూ అదుపు లేకుండా దూసుకెళ్తున్న వాటర్ ట్యాంకర్లు వాహనదారుల వెన్నులో వణకు పుట్టిస్తున్నాయి. తాగునీటి వాహనం వస్తుందంటే దారెంట ప్రయాణించేందుకు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటడం, తాగునీరు చాలకపోవటంతో నగర పౌరులు ప్రత్యామ్నాయంపై ఆధాపడుతున్నారు. ఇదే అదనుగా సొమ్ము చేసుకునేందుకు వేలాది వాటర్ ట్యాంకర్లు బయటకొస్తున్నాయి. వీలైనంత ఎక్కువ ట్రిప్పులు తిరిగేందుకు డ్రైవర్లు ఇష్టానుసారం నడుపుతున్నారు. నెల వ్యవధిలోనే 15 రోడ్డు ప్రమాదాలకు ప్రైవేటు వాటర్ ట్యాంకర్లు కారణంగా పోలీసులు గుర్తించారు. 10 మంది గాయాలపాలవ్వగా, ముగ్గురు మృత్యువాతపడ్డారు. నీటి సరఫరా చేస్తున్నాయనే ఉద్దేశంతో అధికారులు చూసీచూడనట్టు వదిలేయటం



సామాన్యుల ప్రాణాలతో చెలగాటంగా మారింది.

**దూసుకొస్తున్నాయ్.. ప్రాణాలు తీస్తున్నాయ్**

అతివేగం, అనుభవలేమితో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు అమాయకుల ప్రాణాలు బలితీసుకుంటున్నారు. నారాయణగూడ సమీపంలో జలమండలి వాటర్ ట్యాంకర్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న కార్పెంటర్‌జగన్నాథం చారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. మియాపూర్‌లో పని ముగించుకొని నడచుకుంటూ వెళ్తున్న మాల్యాద్రి అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొని చనిపోయారు. కూకట్‌పల్లిలో ప్రైవేటు వసతి గృహంలోకి వాటర్ ట్యాంకర్ దూసుకెళ్లింది. ప్రహరీని ఢీకొట్టి ఆగిపోయింది. నిబంధనల విరుద్ధంగా నడిచే ట్యాంకర్లు, లైసెన్స్ లేని డ్రైవర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

**మైనర్లే డ్రైవర్లు.. నంబర్‌ప్లేట్ కనిపించదు**

వేసవి వచ్చిందంటే తాగునీటి కటకట. రోజువారీ నీటి అవసరాలకు జనం ఇబ్బంది పడుతుంటారు. ఈ ఏడాది ముందుగా నీటి ఇబ్బందులు తలెత్తటంతో వాటర్ ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శివారు ప్రాంతాల్లో వందలాది బోర్లు పుట్టుకొచ్చాయి. రేయింబవళ్లు వాటి నుంచి యథేచ్ఛగా నీరుతోడి నిల్వ చేస్తున్నారు. నగరంలో సుమారు 1000 జలమండలి, సుమారు 5–6వేలకు పైగా ప్రైవేటు ట్యాంకర్లు ఉన్నట్టు అంచనా. నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలకు రంగులు వేసి నడుపుతున్నారు. పాతటైర్లు, మరమ్మతుకు నోచుకోని బండ్లు కావటంతో బ్రేక్ విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రిళ్లు తిరిగే చాలా ట్యాంకర్లు నంబర్ ప్లేట్ లేకుండానే తిరగటం ఆందోళన కలిగిస్తోంది. జలమండలి ఆధ్వర్యంలోని వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు కొందరు మైనర్లకు స్టీరింగ్ అప్పగించి వారు విశ్రాంతి తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రైవేటు పరిస్థితి మరీ ఘోరంగా మారింది.

# తుది దశకు బైపాస్ నిర్మాణం

పెద్దపల్లి: కాజీపేట నుంచి కరీంనగర్‌కు నేరుగా వెళ్లేందుకు పెద్దపల్లి వద్ద నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఉగాది పర్వదినం కంటే ముందే పూర్తి చేసేందుకు పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు పెద్దపల్లి, కొలనూరు నుంచి బైపాస్ మార్గంలోని క్యాబిన్‌తో ఇంటర్‌లాకింగ్ పనులతో పాటు కమీషనింగ్ పనులు పూర్తి చేయనున్నారు. బైపాస్ మార్గంలో లూప్‌లైన్(రెండో లైన్) నిర్మాణానికి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ పనులు కూడా ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి గూడ్స్ రైళ్లను మాత్రమే బైపాస్ మీదుగా మళ్లించనున్నారు. ప్రయాణికుల రైళ్లను తప్పనిసరిగా పెద్దపల్లి స్టేషన్ మీదుగానే నడుపుతారు.

**స్టేషన్‌పై తగ్గనున్న ఒత్తిడి**

బైపాస్ లైన్ నిర్మాణంతో పెద్దపల్లి ప్రధాన స్టేషన్‌పై ఒత్తిడి తగ్గనుంది. బైపాస్ మార్గంలో నిర్మించిన క్యాబిన్ ద్వారానే అక్కడి స్టేషన్ మాస్టర్ రైళ్ల నిర్వహణ బాధ్యతను నిర్వహిస్తారు. ఈ రైలు మార్గాన్ని రైల్వే శాఖ రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గం హుస్సేన్‌మియా వాగు వంతెన సమీపం నుంచి చీకురాయి రైల్వే గేటు రంగంపల్లి వద్ద ప్రస్తుత కరీంనగర్ రైలు మార్గానికి అనుసంధానమవుతుంది. ఈ మార్గం పూర్తయితే కరీంనగర్ వైపు నుంచి వెళ్లే గూడ్స్ రైళ్లు పెద్దపల్లి స్టేషన్‌కు వెళ్లకుండా నేరుగా కాజీపేట, వరంగల్ వైపు వెళ్తాయి. పెద్దపల్లి వైపు నుంచి కరీంనగర్ వెళ్లే రైళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, కాజీపేట, వరంగల్ వైపు నుంచి వచ్చే రైళ్లు కరీంనగర్ వెళ్లాలంటే పెద్దపల్లి స్టేషన్‌లో ఇంజిన్ మార్చుకోవాల్సి వస్తుంది. దీనికే అధికంగా సమయం పట్టనుంది.

**చొరవ చూపితేనే కొత్త రైళ్లు**నిజామాబాద్ నుంచి హైదరాబాద్, ముంబయి మినహా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా సికింద్రాబాద్ మీదుగా ప్రయాణించాల్సిందే. కరీంనగర్ నుంచి తిరుపతికి మినహా మరే దూర ప్రాంతానికి రైళ్లు లేవు. రెండు జిల్లా కేంద్రాల మీదుగా దిల్లీ, చెన్నై లాంటి ప్రాంతాలకు కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఇద్దరు ఎంపీలు చొరవ చూపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంపీ అరవింద్ నిజామాబాద్ నుంచి దిల్లీకి కొత్త రైలు కోసం ప్రతిపాదించారు. విజయవాడ, విశాఖపట్టణం, చెన్నై, బెంగళూర్ వైపు కొత్త రైళ్లను నడిపించేందుకు ఆయనతో పాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవ చూపాల్సి ఉంది.

# ఖాళీగా ఉంది.. కలిపేసుకుంటే మనది!




హైదరాబాద్: మహానగరపాలక సంస్థ.. రంగారెడ్డి.. మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ భూములకు సరిహద్దులు.. కంచెలు.. జియోట్యాగింగ్‌లు లేకపోవడంతో కొందరు వాటిని ప్రైవేటు పట్టాభూముల ఖాతాల్లోకి కలిపేసుకుంటున్నారు. మండలాల వారీగా రికార్డుల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు డిజిటల్ సర్వేలు, జియోట్యాగింగ్‌లు చేస్తామని అధికారులు ప్రకటించినా.. ఇప్పటి వరకూ అవేవీ ప్రారంభం కాలేదు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 400 ఎకరాల భూములను, మేడ్చల్ జిల్లాలో 270 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారని విశ్వసనీయ సమాచారం. వీటి విలువ రూ.2500 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.. ఈ అంశంపై ఇప్పటికే రెవెన్యూ ఉన్నతాధికారులు జిల్లాల కలెక్టర్లతో కొద్దిరోజుల క్రితం అంతర్గతంగా చర్చించినట్టు తెలిసింది. సర్వేల్యాండ్ రికార్డులు, ధరణి పోర్టల్‌లోని ప్రభుత్వ భూముల వివరాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. వచ్చే వారం నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

**జీహెచ్ఎంసీ.. మున్సిపాలిటీల పరిధుల్లో ఉండడంతో..**

నగర శివారులో 250కి పైగా గ్రామాలు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దులో ఉన్నాయి. ఈ గ్రామాల్లోని ప్రభుత్వ భూముల విలువ రూ.కోట్లు పలుకుతుండడంతో కొందరు తమ భూముల పక్కనున్న వాటిని కొంచెం, కొంచెంగా ఆక్రమించుకుంటున్నారు. ప్రభుత్వ భూముల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో మండలాల పరిధిలో ఉన్నాయి. గ్రామాలు మాత్రం గ్రేటర్, మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. రికార్డులు పక్కాగా లేకపోవడంతో ఆక్రమించుకున్న భూములకు బైనంబర్లు వేసి పన్ను చెల్లిస్తున్నారు. రెవెన్యూ విభాగంలోని కిందిస్థాయి సిబ్బందితో కలిసి తప్పుడు రికార్డులు సృష్టించి వారి పరం చేసుకుంటున్నారు. రెండు నెలల క్రితం గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఇవి వెలుగు చూశాయి.

**పక్కాగా లేని డిజిటల్ రికార్డులు..**

పహాణీలు, రెవెన్యూ రికార్డులు, ధరణి పోర్టల్‌లోని ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా డిజిటల్ రికార్డుల్లో లేవు. గ్రేటర్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ భూముల్లో హెచ్ఎండీఏకు, ఐటీ, పరిశ్రమల శాఖలకు కేటాయించారు. ధార్మిక సంస్థలు, కుల సంఘాలకూ భూములను గత ప్రభుత్వం కేటాయించింది. మిగిలిన వాటిని డిజిటల్ సర్వే ద్వారా గుర్తిస్తామని, జియోట్యాగింగ్ చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. క్షేత్రస్థాయిలో అన్నీ అటకెక్కించారు. సర్వే చేసేందుకు సరైన సంఖ్యలో సర్వేయర్లు లేరు.

# ఇష్టారీతిన ఇసుక దోపిడీ



కొడంగల్ : జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి, దోమ తదితర మండలాల్లో కాగ్న, కాకరవాణి నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో అక్రమార్కులు నిరాటంకంగా తమ పని కానిచ్చేస్తున్నారు.

**ప్రభుత్వ పనుల అనుమతుల పేరుతో..:** ప్రభుత్వ పనులకు అనుమతుల పేరుతో యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఉదాహరణకు బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల, కాకర్లగండితండా, మహంతిపూర్, దుప్‌చర్ల గ్రామాల శివారు ప్రాంతాల గుండా పారే కాకరవాణి వాగులో భారీగా పేరుకున్న ఇసుక నిల్వలను ఖాళీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల జాడ కనిపించడం లేదు.

ఇక తాండూరు పరిధిలోని కాగ్నా నది పరివాహకంలో ఇసుక దోపిడీ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లలో నింపి కళ్లముందే తరలిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దీనికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడడమే కాకుండా భూగర్భ జలాలు తగ్గి తాగు, సాగునీటి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యూహం మార్చిన వ్యాపారులు**

ఇసుక అక్రమార్కులు తమ వ్యూహాన్ని మార్చుకుంటున్నారు. వాగు నుంచి పగలు ట్రాక్టర్లలో తరలించి నిల్వ చేసి రాత్రి లారీలలో తరలించేవారు. ఇది తెలిసి రెవెన్యూ అధికారులు ఇటీవల ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని వేలం వేశారు. దీంతో రాత్రికి రాత్రే ట్రాక్టర్లలో తరలించి ఎవరి కంట పడకుండా అప్పటికప్పుడే లారీలలో లోడ్ చేసి తరలించేస్తున్నారు. ఎవరైనా అడిగితే బెదిరింపులకు దిగుతున్నారు. అధికారులు అభివృద్ధి పనులకు రోజుకు ఒకటి లేదా రెండు ట్రిప్పులకు అనుమతి ఇస్తున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు ప్రైవేటు నిర్మాణాలకు తరలిస్తున్నారు.

ప్రభుత్వ పనులకే అనుమతులు: పద్మావతి, తహసీల్దార్, బొంరాస్‌పేట కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ పనులకే ఇసుక తరలించేందుకు అనుమతులు ఇస్తున్నాం. ఇటీవల నిబంధనలు ఉల్లంఘించి నిల్వ చేసిన డంపులను కూడా వేలం వేశాం. సిబ్బంది లేకపోవడం కూడా కొంత ఇబ్బందిగా మారింది. సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తాం.

# యువతకు ఉపాధి చదువులు



వికారాబాద్ : యువతకు డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారు ఉపాధి అవకాశాలు సొంతం చేసుకునే విధంగా ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకుంటోంది. వీరికి నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించటం లేదు. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాలో మూడు ఏటీసీలను ఏర్పాటు చేయనున్నారు. భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అందిస్తున్న కథనం..

**సరిపోని శిక్షణ సంస్థలు**

జిల్లాలో ప్రభుత్వ పరంగా వికారాబాద్, మర్పల్లిలో ఐటీఐ లున్నాయి. తాండూరులో ప్రభుత్వ ఐటీఐ మంజూరు చేసినా ప్రారంభించలేదు. ప్రైవేట్ పరంగా వికారాబాద్, తాండూరులో ఐటీఐలున్నాయి. జిల్లా యువత దాదాపు 3 లక్షలు ఉంటే ఏటా టెన్త్, ఇంటర్ చదివి బయటకు వస్తున్న వారి సంఖ్య దాదాపు 20,000 ఉంటోంది. సంఖ్య ఎక్కువే అయినా సాంకేతిక శిక్షణ కేంద్రాలు సరిపోక పోవడంతో నేర్చుకోలేక పోతున్నారు.

**కేంద్రాల సమాచారం**

జిల్లాలో వికారాబాద్, తాండూరు, మర్పల్లిలో కొత్త ఏటీసీలు

అన్నీ ఒకే విధంగా నమూనాలు

కోర్సులు 6, సీట్లు 240

కోర్సు కాల వ్యవధి.. 2 సంవత్సరాలు.

ఎంతో ప్రయోజనం కలుగుతుంది గడ్డం ప్రసాద్‌కుమార్, స్పీకర్, ఎమ్మెల్యే వికారాబాద్.

జిల్లాలోని వికారాబాద్, మర్పల్లి, తాండూరు ప్రాంతాల్లో ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వికారాబాద్ నియోజక వర్గంలో రెండు కేంద్రాలను మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఈ శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయి. ఉజ్వల భవిష్యత్తుకు దోహదం.. నరేంద్రబాబు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, వికారాబాద్

ప్రభుత్వం ప్రారంభించబోయే ఏటీసీలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు దక్కుతుంది. ఈ కేంద్రాల్లో ప్రారంభించే కోర్సులను పూర్తి చేస్తే ఎంతో మంచి అవకాశాలుంటాయి.

# నిమ్స్ ఎల్వోసీ జారీలో మార్పులు

హైదరాబాద్ : పేదలకు అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ) విధానంలో మార్పులు చేశారు. రాష్ట్రంలో కేవలం ప్రభుత్వ రంగ ఆస్పత్రులకు మాత్రమే ఎల్వోసీ జారీ చేస్తున్నారు. ఇందులో నిమ్స్ కూడా ఉంది. ఆరోగ్యశ్రీ లేని వారు, చికిత్సలకు పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందనే రోగులకు మాత్రమే ఇది వర్తింపచేస్తారు.

**ఇప్పటి వరకు ఇలా..**ఆస్పత్రిలో చేరిన రోగి చికిత్సకు రూ.3లక్షలకు పైగా ఖర్చు అయితే వైద్యులు ఎల్వోసీ దరఖాస్తు చేసుకోవాలని సూచించేవారు. వారికి వైద్యులు అంచనా రసీదు ఇచ్చేవారు. దాని ఆధారంగా మెడికల్ రికార్డ్స్ విభాగం రూ.50 తీసుకొని అభ్యర్థన పత్రాన్ని జారీ చేసేది. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రుల సిఫారసు లేఖల ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమోదం లేఖలను తీసుకొని ఆస్పత్రిలో ఇచ్చేవారు.


**ఇకపై అంతా ఆన్‌లైన్** ప్రస్తుతం ఆస్పత్రిలో ఎల్వోసీ ప్రక్రియను డిజిటలైజ్ చేశారు. ఉదాహరణకు రోగికి కార్డియాలజీలో చికిత్సకు రూ.3లక్షలకు పైగా అవుతుందని వైద్యులు చెప్పి, ఎల్వోసీ కోసం నిమ్స్ హెచ్ఎంఐఎస్ ద్వారా డిజిటల్ రూపంలో ఎస్టిమెట్ రూపొందించి పాలన విభాగం సహాయ మెడికల్ సూపరింటెండెంట్‌కి పంపిస్తారు. అక్కడ పరిశీలించి ఆమోదం తెలుపుతారు. మెడికల్ రికార్డ్స్ విభాగంలో రూ.50 రుసుము చెల్లించి లేఖ తీసుకోవాలి. ఆ లేఖను ఆమోదం కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, ఎంపీ వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. వారు సీఎంఆర్ఎఫ్ పోర్టల్‌లో పరిశీలించి ఆమోదం తెలిపి ఎల్వోసీ మంజూరు చేస్తారు. దీంతో అవినీతికి తావు లేకుండా సేవలందుతాయని అధికారులు చెబుతున్నారు.

# వరి వైపు.. అన్నదాతల చూపు

కరీంనగర్ : జిల్లాలో ఆరేడేళ్ల క్రితం రైతులు యాసంగిలో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపేవారు. కానీ క్రమేణా ఆరుతడి పంటల స్థాయి గణనీయంగా పడిపోయింది. సాగు అయిన భూవిస్తీర్ణంలో 90 శాతంపైగా వరి సాగు చేస్తున్నారు. ఆధునిక వరి వంగడాలతో దిగుబడి సైతం ఆశించిన స్థాయిలో వస్తుండటంతో వరి సాగుకు మొగ్గుచూపుతున్నారు.

శంకరపట్నం మండలంలో 24,303 ఎకరాల్లో పంట సాగు చేయగా, అందులో 24,250 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

గత వానాకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఈసారి వాటిని ఎక్కువ మంది వేశారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సంప్రదాయ వ్యవసాయ విధానంలో యాసంగిలో వేయాల్సిన వేరుశెనగ, మొక్కజొన్న, పెసర, కంది, ఇతర పంటల సాగు పూర్తిగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా కూరగాయల సాగు జిల్లా వ్యాప్తంగా



952 ఎకరాలకే పరిమితం కావడంతో, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి మీదనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుత వ్యవసాయ విధానంలో పంట మార్పిడి జరగట్లేదని, నేలలో సారం తగ్గిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జిల్లాలో యాసంగి సాగు వివరాలు..

మొత్తం ఎకరాలు: 2,90,000

వరి: 2,66,896

మొక్కజొన్న: 20,203

ఇతర పంటలు: 2,901


**వాణిజ్య పంటలపై అవగాహన కల్పిస్తున్నాం**

పంట మార్పిడితో లాభాలు, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా ఇతర పంటల సాగులో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, మార్కెటింగ్ తదితర కారణాలతో రైతులు వరి ధాన్యం వైపు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# రామగిరి ఖిల్లాకు పర్యాటక సిరి

రామగిరి : పెద్దపల్లి జిల్లాలోని రామగిరి ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించగా, కేంద్ర ప్రభుత్వ పర్వతమాల ప్రాజెక్టు కింద రోప్‌వే ఏర్పాటుకు ప్రతిపాదించింది. రామగిరి మండలంలో బేగంపేట నుంచి రత్నాపూర్, కల్వచర్ల గ్రామాల వరకు దాదాపు 7 చదరపు కిలోమీటర్ల మేర ఖిల్లా విస్తరించి ఉంది. ఇక్కడి కట్టడాలు, దర్వాజలు, బురుజులు, రాతి గోడలు ఆకట్టుకుంటున్నాయి. ఖిల్లా చుట్టూ 3–120 అడుగుల ఎత్తులో శత్రుదుర్భేద్యంగా రాతి గోడను నిర్మించారు. క్రీ.శ.ఒకటో శతాబ్దంలో ఖిల్లా కేంద్రంగా రాజులు పాలించినట్లు తెలుస్తోంది.

**చూడదగిన ప్రదేశాలు**ఖిల్లాపై సీతారాముల పాదముద్రలు, సీతమ్మ కొలను, కుంకుమరాళ్లు, సింహాల కోట, పిల్లల ఫిరంగులు, దర్వాజాలు, మల్లెవనం, బృందావనం వంటి కనువిందు చేసే ప్రదేశాలను చూడవచ్చు. రాతి గోడలపై చెక్కిన సీతారామచంద్రుల విగ్రహాలు



నాటి శిల్ప కళకు అద్దం పడతాయి. పెద్దపల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే ఖిల్లాపైకి బేగంపేట వైపు నుంచి ఎక్కడానికి, రత్నాపైర్ వైపు నుంచి దిగడానికి దారులున్నాయి. ఏటా శ్రావణమాసంలో భక్తులు దాదాపు 5–7 కిలోమీటర్ల దూరం నడిచి కోటపై సీతారామచంద్రులను దర్శించుకుంటున్నారు.

**అయిదేళ్ల కిందటే సర్వే**

రామగిరి ఖిల్లా అభివృద్ధికి సుమారు అయిదేళ్ల కిందట రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు సర్వే నిర్వహించారు.

అప్పట్లో వేయి స్తంభాల గుడి, హనుమకొండ, ఖిల్లా వరంగల్, రామప్ప, కాళేశ్వరం, రామగిరి ఖిల్లా, కోటిలింగాల, ధర్మపురి, ఎలగందుల ఖిల్లాలను కలుపుతూ పర్యాటక వలయంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు.

గతేడాది నవంబరులో దేవాదాయ శాఖ అధికారులు ఖిల్లాపై సర్వే నిర్వహించారు. కోటపై శివలింగం, ఆంజనేయస్వామి విగ్రహాలకు ఆలయాలను నిర్మించేందుకు రూ.50 లక్షల చొప్పున అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రామగిరిఖిల్లాకు బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) కింద రూ.5 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో రెండు వైపులా కోట కింది వరకు రహదారులు నిర్మించనున్నారు.

రామగిరి ఖిల్లాకు 2 కి.మీ.ల రోప్‌వే నిర్మాణంపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఎంపీ వంశీకృష్ణలు ఈ నెల 11న దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

రోప్‌వే ఏర్పాటైతే కోట కింది నుంచి పర్యాటకులు నేరుగా ఖిల్లాపైకి చేరుకునే అవకాశం ఉంది.

పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం

రామగిరిఖిల్లా అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరు చేశాం. ఇక్కడి పుణ్య క్షేత్రాలతో ఖిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం. పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ నడుస్తోంది. రోప్‌వేపై ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. రహదారులు నిర్మించిన అనంతరం కోటపై దర్వాజాలు, కళా ఖండాలను అభివృద్ధి చేస్తాం.

డి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి




## పహల్గాం ఘటనపై మోదీ స్ట్రాంగ్ వార్నింగ్

పట్నా: ఉగ్రవాది ఎక్కడ నక్కినా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. "ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం" అని మోదీ అన్నారు. "పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు" అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. ఈసందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. "మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదు" అని మోదీ స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.




## నా బిడ్డకింకా మూడేళ్లే.. ప్లీజ్ నన్ను చంపొద్దు: భరత్‌భూషణ్ ఆఖరి క్షణాలు

పహల్గాం ఉగ్రదాడి ఎన్నో కుటుంబాల్లో ఆనందాన్ని చిదిమేసింది. పసిపిల్లల ముందే కరడుకట్టిన ఉగ్రవాదులు పాశవిక దాడికి తెగబడ్డారు. వేడుకున్నా కనికరించకుండా కుటుంబసభ్యుల ముందే నిర్దాక్షిణ్యంగా తమ వారి ప్రాణాలు తీశారు. తన మూడేళ్ల బిడ్డ భవిష్యత్తు కళ్లముందే కదలాడుతుంటే.. భరత్ భూషణ్ నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోయిన తీరు హృదయాలను మెలిపెడుతోంది. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి వారిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో భరత్‌భూషణ్ ఒకరు. దాడి సమయంలో ఆయన భార్య, మూడేళ్ల కుమారుడితో బైసరన్ బయళ్ల వద్ద సరదాగా గడుపుతున్నారు. అదే తన ఆఖరి క్షణాలు అవుతాయని ఊహించలేకపోయారు. భరత్ భూషణ్ అనూహ్య మరణాన్ని దగ్గరినుంచి చూసిన భార్య సుజాత అంతులేని వేదనకు గురవుతున్నారు. "ఏప్రిల్ 18న మేం వెకేషన్‌కు వెళ్లాం. పహల్గాం మా పర్యటనలో చివరి ప్రాంతం. గుర్రాలపై మేం బైసరన్‌కు వెళ్లాం. అక్కడికి వెళ్లిన తర్వాత కశ్మీరీ కాస్ట్యూమ్స్ ధరించి ఫొటోలు తీసుకున్నాం. మా పిల్లాడితో ఆడుకుంటున్నాం. అప్పుడే ఒక్కసారిగా తుపాకీ శబ్దాలు వినిపించాయి. పక్షులు, అడవి జంతువులను వెళ్లగొట్టేందుకు ఆ శబ్దాలు చేస్తున్నారని తొలుత భావించాం. కానీ రానురాను ఆ సౌండ్ మాకు దగ్గరైంది. అది దాడి అని అర్థమైంది. కానీ మేం దాక్కునేందుకు ప్లేస్ లేకుండా పోయింది. బైసరన్ ఒక పెద్ద మైదానం కదా.. మేం సరిగ్గా మధ్యలో ఉన్నాం. చివరకు టెంట్ల వెనక్కి వెళ్లాం. అవి కూడా మైదానం మధ్యలోనే ఉన్నాయి. మేం అక్కడ దాక్కున్నా.. ఏం జరుగుతుందో మాకు కనిపించింది. అదంతా భయానకంగా అనిపించింది. ప్రతిఒక్కరినీ బయటకు లాగి, వివరాలు కనుక్కొని, కాల్చివేశారు. మా కళ్ల ముందే ఒక వ్యక్తిని తలలో గురిపెట్టి రెండుసార్లు కాల్చారు. మా టెంట్‌కు దగ్గర్లో ఒక ఉగ్రవాది మాటలు నాకు వినిపించాయి. మా పిల్లలు బాధపడుతుంటే.. మీరు సెలవులు ఎంజాయ్ చేస్తారా..? అనడం వినిపించింది. అప్పటికే ప్రాణాలు అరచేతపట్టుకొని మేముంటే.. ఒక ఉగ్రవాది నా భర్త వద్దకు వచ్చాడు. ఏమీ ప్రశ్నించకుండానే కళ్ల ముందే నా భర్తను కాల్చివేశాడు. అప్పటికే నా భర్త అతడిని ఎంతో వేడుకున్నాడు. నాకో చిన్న పిల్లాడు ఉన్నాడు.. దయచేసి వదిలేయండని బతిమాలాడు. కానీ ఆ ఉగ్రవాది కనికరించలేదు" అని ఆమె రోదించిన తీరు చూసి అక్కడున్నవారు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దాడికి బలైన వ్యక్తుల్లో కొత్తగా పెళ్లైన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్, శుభమ్ ద్వివేది ఉన్నారు. తమ భార్యాపిల్లలతో వచ్చిన ప్రశాంత్ శత్పతి, శైలేష్, అమెరికాలో స్థిరపడిన మరో కుటుంబం ఉంది. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతిఒక్కరిదీ కన్నీటి గాథే. వీరికి ఇలాంటి దుస్థితి కల్పించిన ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.




## గత ప్రభుత్వం పంచాయతీ నిధులన్నీ నిర్వీర్యం చేసింది: పవన్ కల్యాణ్

అమరావతి: గ్రామ పంచాయతీల నిధులన్నీ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. బిల్లులు రాకపోయినా పనులు చేసిన గుత్తేదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పవన్ పాల్గొని మాట్లాడారు. "పంచాయతీరాజ్ శాఖను ఇష్టంగా తీసుకున్నా. గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలి. పల్లెల్లో ఉండటమంటే ఇష్టం.. కానీ కుదరలేదు. అధికారులు కృషితో గ్రామాల్లో వేగవంతమైన అభివృద్ధి సాగుతోంది. గతంలో చాలా తండాల్లో పర్యటించా.. అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చిన్న పైరవీలు చేసినా చర్యలు తప్పవు" అని పవన్‌కల్యాణ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు.





## సైలెంట్‌గా నరాలు తెంచినట్లే: భవిష్యత్తులో పాక్‌కు భరించలేని బాధ..!

జమ్మూకశ్మీర్‌లో పహల్గాం దాడి తర్వాత భారత్ పాక్‌కు ఊహించని దెబ్బకొట్టింది. న్యూదిల్లీ మిలిటరీ చర్యలు తీసుకొంటుందని ఊహించిన పాక్ సైనికాధికారులు సరిహద్దుల్లో తమ వనరులు మోహరించుకొని కూర్చొన్నారు. కానీ, వారి ఊహకు అందని దెబ్బకొట్టింది భారత్. అదే సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడం. వాస్తవానికి గతంలో పాక్‌తో యుద్ధాలు, సైనిక ఘర్షణలు జరిగినప్పుడు కూడా దయతో భారత్ ఈ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కట్టుబడింది. ఎందుకంటే ఆ నదుల జలాలు పొరుగుదేశానికి జీవనాడులు. కానీ, ఈసారి సహనం నశించిపోవడంతో ఈ నిర్ణయం తీసుకొంది. ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన నీటి పంపిణీల్లో సింధూ జలాల ఒప్పందం ఒకటి. 1960లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్-పాక్ దీనిని కుదుర్చుకొన్నాయి. ఆరు నదుల నీటిని ఇరుదేశాలు పంచుకొన్నాయి. దీని కింద సింధూ, జీలమ్, చీనాబ్ నదుల నీరు పాకిస్థాన్‌కు దక్కింది. ఇవి కాకుండా బియాస్, సట్లెజ్ జలాలు కూడా వెళుతుంటాయి. ఇక భారత్ ఈ నదుల్లో ప్రవహించే నీటిని పాక్‌కు చేరేలా వాడుకోవాలి. అంటే జలవిద్యుత్ ఉత్పత్తి వంటి వాటికి మాత్రమే వినియోగించాలి. కానీ, పాక్ ఈ నీటి పైనే ఆధారపడింది. దీనిని దృష్టిలో ఉంచుకొనే ఎన్ని సంఘర్షణలు జరిగినా భారత్ దయతో ఈ ఒప్పందం కొనసాగించింది.

## గోరంట్ల మాధవ్‌కు 14 రోజుల రిమాండ్



గుంటూరు: చేబ్రోలు కిరణ్‌పై దాడి కేసులో అరెస్టయిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయనతో సహా ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం ఆరుగురికి రిమాండ్ విధించింది. ఇటీవల న్యాయస్థానం విధించిన రెండు రోజుల కస్టడీ ముగియడంతో పోలీసులు ఆయన్ని గురువారం కోర్టులో హాజరుపరిచారు. అంతకు ముందు జీజీహెచ్‌లో వైద్యపరీక్షలు చేయించారు. ఇటీవల చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు గుంటూరు తీసుకువస్తుండగా అతనిపై మాధవ్ దాడికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. పోలీసు కార్యాలయంలో కూడా మరోసారి దాడికి యత్నించడంతో నగరంపాలెం పోలీసులు మాధవ్‌ను, ఆయన అనుచరులు ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించగా తొలుత రాజమండ్రి జైలుకు తరలించారు. వారికి బెయిల్ కోరుతూ మాధవ్ తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఐదు రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మరో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను కొట్టేశారు. గోరంట్ల మాధవ్ సహా ఐదుగురు నిందితులను బుధ, గురువారాల్లో రెండు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించారు. తాజాగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.




## పహల్గామ్ దాడితో తిరుమలలో అలర్ట్

తిరుమల : జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడితో తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రంతో పాటు ఘాట్‌రోడ్డులో పలు చోట్ల భద్రతా సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలను, అందులోని లగేజ్‌లను తనిఖీ చేస్తున్నారు. ఉగ్రముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో సోదాలు ముమ్మరం చేశారు. పహల్గామ్ దాడి నేపథ్యంలో తిరుమలలో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముష్కరులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని కేంద్ర ఇంటలిజెన్స్ హెచ్చరిక చేసిన నేపథ్యంలో తిరుమలకు వస్తున్న భక్తులను అందరినీ కూడా భద్రతా సిబ్బంది తనిఖీ చేస్తోంది. అలిపిరి వద్ద నుంచే భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, భక్తులను కూడా సెర్చ్ చేసిన తర్వాతే తిరుమలకు అనుమతిస్తున్నారు మరోవైపు తిరుమల ఘాట్ రోడ్డు, తిరుమలలో కూడా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పలు చోట్ల సోదాలు చేపడుతున్నారు. భక్తుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ.. అందులో ఏదన్నా అనుమానంగా వస్తువులు కనిపిస్తే భక్తులను విచారించిన తర్వాతే వారిని విడిచిపెడుతున్న పరిస్థితి. అటు తిరుమలలో కూడా గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద కూడా భద్రతను పెంచడంతో పాటు అక్కడ ఆక్టోపస్ సిబ్బందితో పహారా కాసేలా ఏర్పాట్లు చేశారు. పహల్గామ్‌లో జరిగిన దాడి నేపథ్యంలో తిరుమల మొత్తం కూడా హైఅలర్ట్ జారీ చేశారు. తిరుమలకు వచ్చే భక్తులను తనిఖీ చేస్తూ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు.

**బయటపడ్డ డొల్లతనం..** ఇదిలా ఉండగా.. తిరుమలలో భద్రతలోని డొల్లతనం మరోసారి బట్టబయలైంది. ఓ వైపు కశ్మీర్ ఉగ్రదాడులు నేపథ్యంలో టీటీడీ విజిలెన్స్ తిరుమలలో ఆకస్మికంగా తనిఖీలంటూ హడావుడి చేస్తుండగా.. మరోవైపు అన్యమత దేవుడి బొమ్మ అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకుని మరీ తిరుమలకు చేరుకుంది.

కారుపై అన్యమత పేర్లు ఉన్నా కూడా భద్రతా సిబ్బంది గుర్తించని పరిస్థితి. దీంతో తిరుమలలో అన్యమత గుర్తులతో కారు యదేచ్ఛగా తిరుగుతోంది. ఈ కారును చూసి శ్రీవారి భక్తులు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




నెల్లూరు, ఏప్రిల్ 24: జిల్లాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. జిల్లాపై ఉగ్రనీడలు ఉన్నాయన్న అనుమానంతో ఉగ్రనీడులు, స్లీపింగ్ సెల్స్‌పై ముమ్మరంగా ఆరా తీస్తున్నారు. జిల్లాలో ఉగ్రవాదులకు ఎవరైనా సపోర్టర్స్ ఉన్నారా అనే దానిపైనా విచారణ చేస్తున్నారు. జిల్లాలో విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేస్తూ అనుమానితులను విచారిస్తున్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు హై అలర్ట్ అయ్యారు. గత రెండు రోజులుగా వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. కొన్ని బృందాలను ఏర్పాట్లు చేసి ఆరా తీస్తున్న పరిస్థితి. గతంలో జిల్లాలో చోటు చేసుకున్న కొన్ని ఘటనల నేపథ్యంలో కూడా పోలీసులు అప్రమత్తమై విచారణ చేస్తున్నారు. గతంలో బుచ్చిపాలెంకు చెందిన షేక్ ఇలియాజ్ అహ్మద్‌ను ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఆయనన్ను పట్టిస్తే రెండు లక్షల రివార్డు కూడా ఇస్తామని అప్పట్లో ఎన్ఐఏ చెప్పింది. షేక్ ఇలియాజ్ అహ్మద్.. పెద్ద సంఖ్యలో యువకులను నిజామాబాద్‌లో సాయుధ శిక్షణ ఇచ్చేవాడని.. మారణహోమాలకు కుట్రలు చేసినట్లు ఎన్ఐఏ అభియోగం మోపింది. ఎలాంటి ఆయుధాలు లేకుండా ప్రాణాలు తీసేలా శిక్షణ ఇవ్వడంలో నేర్పరి. ఇలియాజ్‌ను పట్టుకునేందుకు కొన్ని ఇళ్లలో సోదాలు చేసేందుకు గతంలో ఎన్ఐఏ బుచ్చిపాలెం వచ్చింది. అయితే అక్కడ కొంతమంది ముస్లిం యువకులు అడ్డగించి ఎన్ఐఏను లోపలకు రానీయకుండా అడ్డుకున్నారు. లోకల్ పోలీసులు వెళ్లినప్పటికీ ఎన్ఐఏ సోదాలు చేయలేకపోయారు. అయితే ఇటీవల నాంపల్లి కోర్టులో ఉగ్రవాది షేక్ ఇలియాజ్ అహ్మద్ లొంగిపోయాడు. ప్రస్తుతం ఇతడు రిమాండ్‌లో ఉన్నాడు. నెల్లూరు జిల్లా కోర్టులో కొన్నేళ్ల క్రితం బాంబు పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. గుర్తుతెలియని వ్యక్తులు కుక్కర్‌లో బాంబు పెట్టి పేల్చారు. అదే తరహాలో కేరళ, తమిళనాడు, చిత్తూరులో కూడా సంఘటనలు చోటు చేసుకున్నాయి. దానిపై ఎన్ఐఏ విచారణ జరిపింది. ఈ పేలుడు వెనక ఉగ్రవాదుల హస్తం ఉండవచ్చని అప్పట్లో అనుమానాలు రేకెత్తాయి. ఈ క్రమంలో జిల్లాలో ఉగ్రవాద కార్యకలాపాలు ఏమైనా ఉన్నాయా, ఎవరైనా వచ్చి వెళ్తున్నారా, ఉగ్రవాదులకు సపోర్టర్స్ ఎవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుగుతోంది. డ్రోన్ క్యామ్‌తో పెద్దఎత్తున వెతుకులాట మొదలుపెట్టారు. రెండు రోజులుగా రేయింబవళ్లు కూడా పూర్తి స్థాయిలో వాహనాలను తనిఖీలు చేస్తున్నారు.

అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి పంపిస్తున్న పరిస్థితి. ఇక మరోవైపు పెహల్గామ్ ఉగ్రదాడిలో జిల్లాకు చెందిన మధుసూదన్ రావు చనిపోవడంతో జిల్లాలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాద కార్యకలాపాలపై పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు గుడ్ న్యూస్.. జూన్ 1న తుది పరీక్ష



అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూన్ 1న తుది రాతపరీక్ష నిర్వహించబోతున్నట్లు ప్రకటించింది. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జూన్ 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాత పరీక్ష నిర్వహించనున్నారు. 2023 జనవరిలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షకు 4.59 లక్షల మంది హాజరుకాగా.. మొత్తం 95,208 మంది అర్హత సాధించారు. వీరికి 2024 డిసెంబరులో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 38,910 మంది నెగ్గారు.

వీరందరికీ జూన్ 1న రాత పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాలు slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది.

## అనసూయ.. చీరలో స్టన్నింగ్ గ్లామర్ ట్రీట్

టాలీవుడ్ లో స్టార్ యాంకర్ గా తనదైన ముద్ర వేసుకున్న అనసూయ భరద్వాజ్.. సినిమాల్లోనూ తన హవాను కొనసాగిస్తూ దూసుకుపోతోంది. అందం, అభినయం, గ్లామర్, స్టైల్ అన్నీ కలగలిసిన ఆమె.. ఎప్పటికప్పుడు కొత్త లుక్స్ తో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా అనసూయ మరోసారి తన స్టన్నింగ్ లుక్స్ తో సోషల్ మీడియాలో హీట్ పెంచేసింది. వైట్ ఫ్లోరల్ ట్రాన్స్‌పరెంట్ సారీతో గ్లామరస్ లుక్ లో దర్శనం ఇచ్చి అందరినీ షాక్ కి గురి చేసింది. ఈ ఫోటోషూట్ లో అనసూయ హాల్టర్ నెక్ వైట్ బ్లౌజ్ కు మ్యాచ్ అయ్యే ఫ్లోరల్ ప్రింటెడ్ సారీలో అదరగొట్టింది. స్టైలిష్ హెయిర్, మినిమల్ జ్యువెల్రీతో ఆమె ఇచ్చిన పొజెస్ మరో లెవల్ లో ఉన్నాయి. ట్రాన్స్‌పరెంట్ లుక్ తో తన గ్లామర్ ను మరింత హైలైట్ చేసింది. సారీలో గ్లామర్ ను హైలెయ్ చేయడమంటే ఇదే అనిపించేలా



కనిపిస్తోంది. ఒకవైపు అందం, మరోవైపు తన మైమరిపించే ఎక్స్‌ప్రెషన్స్ తో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అనసూయ స్టైల్, ఫ్యాషన్ గురించి చెప్పనక్కర్లేదు. ఆమె ఏ లుక్ లో కనిపించినా ట్రెండింగ్ లోకి వచ్చేస్తుంది. ఇప్పుడు ఈ ట్రెడిషనల్ సారీ లుక్ లో కూడా గ్లామర్ డోస్ పెంచుతూ ఫ్యాన్స్ ని కనువిందు చేస్తోంది. ఆమె కేవలం యాంకర్ గా మాత్రమే కాకుండా ఓ సక్సెస్‌ఫుల్ నటిగా కూడా ప్రూవ్ చేసుకుంది. 'పుష్ప'లో దాక్షయణిగా నటించి మరో లెవల్ లో పేరు తెచ్చుకుంది. త్వరలోనే రానున్న మరికొన్ని బిగ్ మూవీస్ లోనూ అనసూయ కీలక పాత్రలో కనిపించనుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా, నెటిజన్లు ఆమె అందాన్ని చూసి ఫిదా అవుతున్నారు. కామెంట్స్ విభాగంలో 'అమ్మో మైండ్ బ్లాక్ అయిపోయింది', 'అనసూయ స్టన్నింగ్ గ్లామర్ ', 'వైట్ లో ఎంతో అందంగా ఉన్నావ్' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## పుష్ప 2 కావేరి.. చీరలో అందాల మెరుపులా..


'పుష్ప 2' సినిమా విజయం సాధించడంతో అందులోని ప్రతి పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ గా నిలిచింది. ఇందులో 'కావేరి' పాత్రలో నటించిన పావని కరణం ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోటోషూట్‌లతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ఎప్పుడూ సింపుల్ లుక్‌లో కనిపించే పావని, తాజాగా స్టైలిష్ ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోతూ కుర్రాళ్ల గుండెల్లో దడ పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే పావని, తాజాగా గోల్డెన్ శారీలో దిగిన ఫోటోలను షేర్ చేసింది. ప్రాముఖ్యమైన అవార్డు షో కోసం స్టైలింగ్ అన్ని స్వయంగా చేసుకున్నానని తెలిపింది. ఆమె కర్లీ హెయిర్, మినిమల్ మేకప్, జ్యువెలరీతో ఓ రాయల్టీ ఫీల్‌ను తీసుకువచ్చింది. సింప్లిసిటీ లో ఉండే అందాన్ని మరోసారి నిరూపించిన ఈ లుక్స్, నెటిజన్లను మాయ చేస్తున్నాయి. న్యెట్ లైట్స్ లో ఆమె ఫోజ్ చేసిన ఫోటోలు హాట్ టాపిక్ గా మారాయి. పావని కరణం కెరీర్ విషయానికొస్తే, ఆమె 'పరేషాన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. "సమోసా తింటావా శిరీష?"



అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిన్నా చితకా సినిమాల్లో నటించిన ఈ అమ్మడు, 'పుష్ప 2'లో కీలక పాత్ర పోషించడం ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయ్యింది. పుష్ప రాజ్ అన్నయ్య కూతురుగా 'కావేరి' పాత్రలో నటించి ప్రేక్షకుల మనసులు దోచుకుంది. ఆ సినిమాలో తన నటన ఎంత బలమైనదో ఇప్పుడు ఈ ఫోటోషూట్‌లోనూ తన గ్లామర్‌తో మరోసారి నిరూపిస్తోంది. సాధారణంగా నటీనటులు వెస్ట్రన్ లుక్స్‌లో హాట్ ఫోటోషూట్‌లు చేస్తుంటారు. కానీ పావని ట్రెడిషనల్ లుక్‌లోనూ అందాన్ని చాటుకోవచ్చు అని ప్రూవ్ చేసింది. ఎప్పుడూ మోడరన్ లుక్‌లో కాకుండా, సింప్లిసిటీ లోనూ ఎంత అద్భుతంగా మెరిసిపోవచ్చో ఈ ఫోటోలు చెబుతున్నాయి. అంతే కాకుండా అవార్డును పట్టుకుని ఇచ్చిన పోజులు ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ లా నిలిచేలా ఉన్నాయి. త్వరలో పావని మరిన్ని వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటించే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది.




## ఫహాద్- జక్కన్న.. ఆ సినిమాలు ఏమైనట్లు?








మాలీవుడ్ ప్రముఖ నటుడు ఫహాద్ ఫాజిల్ కు తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ పుష్ప సిరీస్ చిత్రాలతో ఆయన తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. సూపర్ క్రేజ్ కూడా సంపాదించుకున్నారు. పలు మాలీవుడ్ మూవీల టాలీవుడ్ వెర్షన్లతో ఆడియన్స్ ఓ రేంజ్ లో మెప్పించారు. అయితే ఆయన నటించిన ఆవేశం మూవీ ముందు.. బాహుబలి సిరీస్ చిత్రాల ప్రొడక్షన్ హౌస్ ఆర్కా మీడియా కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఫహాద్ తో ఆక్సీజెన్, డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ పేరుతో రెండు సినిమాలు చేస్తున్నట్లు గత ఏడాది మార్చిలో అనౌన్స్ చేసింది.

దర్శకధీరుడు రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తారని తెలిపింది. అంతే కాదు.. రెండు సినిమాలకు సంబంధించిన ఫస్ట్ లుక్స్ ను విడుదల చేసింది. ఆ తర్వాత పలుమార్లు క్యాస్టింగ్ కాల్ అనౌన్స్మెంట్స్ కూడా ఇచ్చింది. కానీ సినిమాలు ప్రకటించి ఏడాదికిపైగా అవుతుంది. మేకర్స్ ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్స్ ఇవ్వడం లేదు. దీంతో ఆ రెండు చిత్రాల గురించి ఇప్పుడు జోరుగా చర్చ సాగుతోంది.

అయితే పాన్ ఇండియా లెవెల్ లో రూపొందనున్న ఆ రెండు మూవీస్.. ఇప్పుడు హెూల్డ్ లో ఉన్నాయని తెలుస్తోంది. షూటింగ్ ప్రారంభమవ్వడానికి ముందే ఓటీటీ డీల్స్ ను పూర్తి చేయాలని మేకర్స్ భావించారట. కానీ అనుకున్న స్థాయిలో డీల్స్ సెట్ అవ్వడం లేదని సమాచారం. అదే సమయంలో ఫహాద్ తన సినిమాల షెడ్యూల్స్ తో బిజీగా ఉన్నారు. దీంతో ఆ రెండు ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని సమాచారం. ముఖ్యంగా ఆర్కా మీడియా ఎలాంటి అప్డేట్స్ ఇవ్వడం లేకపోవడం గమనార్హం. అసలు ఆ సినిమాల సంగతేంటని కొందరు నెటిజన్లు క్వశ్చన్ చేస్తున్నారు. ఏం జరుగుతోందని అంటున్నారు. హెూల్డ్ లో వెళ్లడానికి ఓటీటీ డీల్సే కారణమా అని కామెంట్లు పెడుతున్నారు. ఇక ఆ రెండు సినిమాల విషయానికొస్తే.. ఆక్సీజెన్ మూవీకి సిద్దార్థ్ నాదెళ్ల, డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమాకు శశాంక్ యేలేటి దర్శకులుగా వ్యవహరిస్తున్నట్లు ఆర్కా మీడియా తెలిపింది. రెండు సినిమాలకు గాను కాల భైరవ సంగీతం అందిస్తున్నట్లు చెప్పింది. మంచి కంటెంట్ తోనే తీస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. మరి ఆ రెండు చిత్రాలు ఏమవుతాయో వేచి చూడాలి.

## నాని 'ది ప్యారడైజ్'.. ట్రెండుకు తగ్గట్లే డబుల్ డోస్




టాలీవుడ్‌లో ఎప్పుడూ కొత్త కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే నాని, ఈసారి తన కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ కోసం సిద్ధమయ్యాడు. 'దసరా'తో మాస్ హీరోగా మరో స్థాయికి వెళ్లిన నేచురల్ స్టార్, 'ది ప్యారడైజ్' అనే విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇటీవల నాని ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఈ ప్రాజెక్ట్‌ను 'ఇండియన్ మ్యాడ్ మ్యాక్స్' లా ఊహించొచ్చని చెప్పాడు. నాని ఫస్ట్ లుక్ చూసినప్పుడు అదే ఫీలింగ్ రావడం విశేషం. ఇప్పుడు దీనికి మించి, ఈ కథలో చెప్పాల్సిన అంశాలు చాలా ఎక్కువగా ఉండటంతో, ఒక సినిమాగా మించి మరో పార్ట్ కూడా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. టాలీవుడ్‌లో ఇటీవల భారీ బడ్జెట్ చిత్రాలు రెండు భాగాలుగా తెరకెక్కడం ట్రెండ్‌గా మారింది. ఆ ట్రెండ్‌లోనే 'ది ప్యారడైజ్' కూడా నిలవనుందని తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌లో నాని లుక్ చాలా ఇంటెన్స్‌గా ఉంది. రంగు రంగుల బ్యాక్‌డ్రాప్, నాని వేషధారణ, గడ్డం, మెడలో గొలుసులు, రెండింటికి విడదీయరాని కాకిలా ఉన్న గ్రాఫిక్స్.. ఇవన్నీ సినిమా టోన్‌ను మరింత ఆసక్తికరంగా మార్చేశాయి. అలాగే ట్రాన్స్ జెండర్ అనే షాకింగ్ గాసిప్స్ కూడా వైరల్ అవుతున్నాయి. మాస్ హీరోగా పూర్తిగా కొత్త అవతారం ఎత్తిన నాని, ఈ పాత్రలో రఫ్ లుక్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరచబోతున్నాడు. ఈ లుక్ సినిమాకు సంబంధించిన సస్పెన్స్‌ను మరింత పెంచేలా ఉంది. పైగా ఇది మామూలు కమర్షియల్ సినిమాతో పోల్చదగినది కాదు, కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చిన సినిమా అని ఫస్ట్ గ్లింప్స్‌తోనే అర్థమైంది. 'ది ప్యారడైజ్' భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. 'దసరా'తో మంచి విజయాన్ని అందుకున్న శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండటంతో, ఈసారి దర్శకుడి మేకింగ్ మరింత డిఫరెంట్‌గా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎప్పుడూ క్వాలిటీ ప్రాజెక్ట్‌లను ప్రొడ్యూస్ చేసే బ్యానర్ అయిన %యాం% సినిమాస్‌లో ఈ మూవీ రూపొందుతోంది. సంగీతం అనిరుధ్ అందిస్తుండటంతో, సినిమా మ్యూజిక్ పరంగా కూడా మరింత క్రేజీగా ఉండే అవకాశం ఉంది. ఈ సినిమాకు భారీ బడ్జెట్ ఖర్చు అవుతోందని, ఇప్పటివరకు నాని చేసిన ప్రాజెక్ట్స్‌లో ఇదే అత్యంత ఖరీదైనదని టాక్. ఫస్ట్ పార్ట్ 2026 మార్చి 26న విడుదల కాబోతోంది. అయితే రెండో భాగం కోసం మాత్రం ఇంకొంత సమయం పట్టే అవకాశం ఉంది. రెండు భాగాలుగా తెరకెక్కించే చిత్రాలు ఎక్కువ టైమ్ తీసుకునే అవకాశం ఉండటంతో, 'ది ప్యారడైజ్ 2' ఎప్పుడు రానుందన్నది ఉత్కంఠ రేపుతోంది. కానీ ఈ కథకు ఒకే సినిమా సరిపోదని, ప్రేక్షకులు రెండు భాగాలుగా చూస్తేనే అసలైన అనుభూతి అందుకుంటారని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ట్రెండుకు తగ్గట్లే నాని ఎలాంటి విజయాలను అందుకుంటాడో చూడాలి.

## ఫేమస్ అవ్వడం కోసమే ఇద్దరి మధ్యా చిచ్చు పెట్టిందా?

ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన చిన్న సినిమాలు సంచలనమైతే అందులో నటీనటులు ఓవవర్ నైట్ లో ఫేమస్ అయిపోతారు. అలాంటి చిన్న సినిమాల్లో ఇటీవల రిలీజ్ అయిన ప్రదీప్ రంగనాద్ నటించి డ్రాగన్ ఒకటి. తెలుగు, తమిళ్ లో ఈ సినిమా మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రదీప్ సంగతి పక్కన బెడితే ఇందులో సెకెండ్ హీరోయిన్ గా నటించిన కయాదు లోహర్ బాగా ఫేమస్ అయింది. అమ్మడు స్కిన్ షోతో కుర్రాళ్లలో కాకలు పుట్టించింది. సొగసరి అందానికి యువత ఫిదా అవుతుంది. సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోనూ నిలిచింది. అప్పుడే తెలుగు సినిమాలు కూడా సైన్ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఓ సినిమాలో ఎంపికైందని సమాచారం. అయితే ఈ భామ కోలీవుడ్ లో ఇద్దరు స్టార్ హీరోల అభిమానుల మధ్య పెద్ద చిచ్చే రేపింది. ఇటీవల ఓ కాలెజ్ ఈవెంట్లో అభిమానులు



మీకు ఇష్టమైన హీరో ఎవరని అడిగితే తలపతి విజయ్ పేరు చెప్పింది. సర్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. అందులోనూ విజయ్ నటించిన తేరి సినిమా ఎన్నిసార్లు చూసానో? తనకే తెలియదదంది. అయితే ఇదే బ్యూటీ గతంలో తన అభిమాన హీరోగా ధనుష్ పేరు చెప్పింది. అతడి హిట్ సినిమాల గురించి తెగ పొగిడేసింది. ఇలా ఇద్దరుహీరోల పేర్లు చెప్పడంతో? ఆ హీరోల అభిమానుల మధ్య చిచ్చు రేగింది. ఇద్దరు హీరోల అభిమానులు కయాదు ను లైక్ చేసిన వారు కావడంతో ఈ కుంపంటి మొదలైంది. కయాదు కు మా హీరో మాత్రమే క్రష్ అంటూ ఇరువురు హీరోల అభిమానులు సోషల్ మీడియాలో యుద్ధానికి తెర తీసారు. అయితే కయాదు ఇలా చెప్పడానికి కారణం ఇద్దరు హీరోల అభిమానుల మధ్య మరింత ఫేమస్ అవ్వం కోసమే ఈ డ్రామాకి తెర తీసిందంటూ మరికొంత మంది అభిమానులు మండి పడుతున్నారు. దీనికి తెర పడాలంటే కయాదు హీరోలిద్దరు సమానమే అంటే తప్ప పంచాయతీ తెగదు.

## ఖుషీ కపూర్.. మరోసారి హీటెక్కించే గ్లామర్ జోష్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ ఖుషీ కపూర్ స్టైలింగ్ లో ఎప్పుడూ ఒక ప్రత్యేకత ఉంటుంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. తెల్లని లేస్ ఔట్‌ఫిట్‌లో ఖుషీ తన అందాన్ని మరింతగా హైలైట్ చేస్తూ గ్లామర్ కవర్ లుక్‌లో మెరిసిపోయింది. సూర్యకాంతి తాకుతూ, ఆకర్షణీయమైన పోజులతో కెమెరా ముందు తన అందాన్ని ఒలకబోస్తూ ఖుషీ స్టన్నింగ్ లుక్స్‌తో అభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తోంది. ఫోటోల్లో ఖుషీ పూర్తిగా బోల్డ్ లుక్‌లో కనిపిస్తోంది. గోధుమ రంగులో మెరిసే సన్‌కిస్డ్ లుక్ ఆమె బ్యూటీని మరింత హైలైట్ చేసింది. ఫోటో షూట్ లో ఆమె తన గ్లామరస్ అప్పీల్‌తో స్టైలిష్ లుక్స్‌ని హైలెట్ చేసింది. ఆమె వేసుకున్న వైట్ లేస్ డ్రెస్ మోడ్రన్ టచ్‌తో, ఫెమినిన్ గ్రేస్‌తో మెస్మరైజ్ చేసింది. దానికి తగ్గట్టుగా మినిమల్ జువెలరీ, ఓపెన్ హెయిర్ స్టైలింగ్ ఖుషీ అందాన్ని రెట్టింపు చేసింది. ఓ ఫోటోలో ఖుషీ లాజ్ బ్రీజీ మూడ్‌లో



సూర్యకాంతిని ఆస్వాదిస్తున్నట్టు కనిపించగా, మరొక ఫోటోలో సీటింగ్ పోజ్‌లో స్టన్నింగ్ లుక్ ఇచ్చింది. మరికొన్ని ఫోటోల్లో తన స్టైల్ స్టేట్మెంట్‌ను చూపిస్తూ స్నేహితులతో ఎంజాయ్ చేస్తూ కనిపించింది. ఈ ఫోటోషూట్ ఖుషీ గ్లామర్ గేమ్ ఎక్కడికీ వెళ్ళిందో చెప్పడానికి నిదర్శనం. ఖుషి తన అద్భుతమైన ఫోటో షూట్ లుక్స్ ద్వారా మరోసారి తన ట్రెండీ స్టైల్ సెన్స్‌ను ప్రూవ్ చేసుకుంది.

ఖుషీ కపూర్ బాలీవుడ్‌లో తన ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఆమె స్టైలిష్ అప్పీల్, ఫ్యాషన్ చాయిస్‌లు ట్రెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ గ్లామరస్ ఫోటోషూట్ చూస్తే ఖుషీ త్వరలోనే స్టార్‌డమ్‌కు చేరుతుందని చెప్పొచ్చు. ఖుషీ బోల్డ్ స్టెప్పులు, గ్లామరస్ లుక్స్ సోషల్ మీడియాలో గట్టిగానే వైరల్ అవుతున్నాయి. దీంతో అభిమానులు ఆమె డెబ్యూ మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పాలి.



## తెలంగాణలో హై అలెర్ట్.. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో పోలీసు శాఖ అప్రమత్తం

హైదరాబాద్ : దేశ వ్యాప్తంగా మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 25, 26 వ తేదీల్లో హెచ్ఐసీసీ కేంద్రంగా జరగనున్న భారత్ సమిట్-2025, మే 7 నుంచి 31 వరకు జరగనున్న మిస్ వరల్డ్-2025 సహా పలు జాతీయ స్థాయి కార్యక్రమాల నేపథ్యంలో భద్రతను మరింత పటిష్టం చేయనున్నారు. హైదరాబాద్ సహా దేశంలో ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలన్న హెచ్చరికల నేపథ్యంలో సీఎస్ శాంతికుమారి రాష్ట్ర పోలీస్ యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు.

ఈ మేరకు డీజీపీ జితేందర్ బుధవారం రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులకు పలు అంశాలపై సూచనలు చేసినట్లు తెలిసింది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరమైన అంశాలపై భారత్ సమిట్‌లో చర్చ జరగనుంది. ఈ సమిట్‌లో రాహుల్‌గాంధీ సహా వంద దేశాల నుంచి దాదాపు 400 మంది హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో పాటు మిస్ వలర్డ్ పోటీలకు 140 దేశాల నుంచి కంటెస్టెంట్స్ హాజరవుతున్నారు. ఇవన్నీ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాలు కావడంతో పోలీస్ యంత్రాంగం సవాల్‌గా తీసుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఇప్పటికే టెర్రరిస్టుల దాడులకు గురైన ప్రాంతాలు సహా పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితులు, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా పెట్టినట్టు సమాచారం. భారత్ సమిట్ జరిగే సైబరాబాద్ కమిషనరేట్ పరిసర ప్రాంతాలను గురువారం రాత్రి నుంచే తమ ఆధీనంలోకి తీసుకోన్నారు. హైటెక్ సిటీ సహా విదేశీయులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. పాతబస్తీ సహా అనుమానిత ప్రాంతాల్లో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు.



## తెలంగాణకు రెడ్ అలర్ట్ మండే ఎండలపై వాతావరణ శాఖ వార్నింగ్

తెలంగాణ రాష్ట్రంలో రెండు రోజుల పాటు భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఐఎండీ అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకు ఎండల తీవ్రత భారీగా పెరుగుతుంది. ఇక, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. . ఆదిలాబాద్, కోమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు రెడ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ అయ్యాయి. దీంతో రెడ్ అలెర్ట్ ఉన్న జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా టెంపరేచర్స్ నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలకు తప్ప మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్స్ జారీ చేశారు. రాత్రిపూట కూడా వాతావరణం వేడిగా ఉండే అవకాశం ఉందని తెలియజేశారు రెడ్ అలెర్ట్ జారీ చేసిన తొమ్మిది జిల్లాలకు మినహా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేసింది ఐఎండీ. పెరుగుతున్న రాత్రి పూట ఉష్ణోగ్రతలతో తీవ్ర ఉక్కపోత నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వడ గాల్పుల ప్రభావం ఉంటుందని పేర్కొనింది. ఇక, వడ దెబ్బ ప్రభావంతో మరణాలు మరింతగా పెరిగే ఛాన్స్ ఉంది అని హెచ్చరించారు. కాబట్టి అవసరం ఉంటేనే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచనలు జారీ చేశారు.

## ఈ దేశంపై మీకు ప్రేమ లేదా.. వారిపై రఘునందన్ ఫైర్



సిద్దిపేట: జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఖండించారు. ఈ సందర్భంగా అమరులకు సంతాపం తెలిపారు. పహల్‌గామ్‌లో తీవ్ర వాదుల చర్య దుర్మార్గమైనదని అన్నారు. ఇవాళ(గురువారం) సిద్ది పేట జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... అన్యపుణ్యం తెలవని 27మంది పర్యాటకులను ఉద్రవాదులు దుర్మార్గంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడల్లా దేశంలో అలజడులు జరుగుతున్నాయని ఆరోపించారు. జమ్మూ కశ్మీర్‌లో తెలంగాణకి చెందిన 150మంది పర్యాటకులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనపై సోకాల్డ్ సెక్యులర్ మేధావులు ఎందుకు నోరు మెదపడం లేదని.. వారికి దేశం పట్ల ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. స్టాలిన్, కమలాసన్, ప్రకాశ్‌రాజ్ ఎందుకు జమ్మూ కశ్మీర్ ఘటనపై నోరు మెదపడం లేదని.. ఈ దేశంపై మీకు ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. టెర్రరిస్ట్ సంస్థలపై మోదీ ప్రభుత్వం ఖచ్చితంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాబర్ట్ వాద్రా బీజేపీపై బురదజల్లటం మానుకోవాలని.. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఒవైసీ పేద ముస్లింల కోసం ఆలోచించడం లేదని చెప్పారు. డెవలప్‌మెంట్‌కి ముస్లింలను దూరంగా ఉంచేది ఏంఐఎం పార్టీ అని విమర్శించారు. గత రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో జరుగుతున్న సంఘటనలు బాధాకరమని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఒక వర్గానికి చెందిన కొంతమంది శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మదర్సాల గురించి రేవంత్ ప్రభుత్వం ఆలోచించాలని చెప్పారు. తెలంగాణను ఇస్లామిక్ అడ్డాగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హిందూ ధర్మం పరమత సహనాన్ని పాటించమని చెబుతోందని అన్నారు. హిందూ దేవాలయాల మీద దాడులు చేస్తే ప్రజలు ఊరుకునే పరిస్థితిలో ప్రస్తుతం లేరని అన్నారు. మతం పేరిట జరిగిన దాడులను హిందువులు ఖండించాలని.. ఆలోచించాలని చెప్పారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మదర్సాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.

## 25 తర్వాత భారీగా బదిలీలు!



హైదరాబాద్ : తెలంగాణ సర్కారు గడిచిన ఏడాదిన్నర కాలంగా వివిధ కోణాల్లో మార్పులు, చేర్పులతో సుస్థిర పాలన దిశగా రేవంత్ సర్కారు అడుగులు వేస్తోందని కాంగ్రెస్ నేతలు అన్నారు. తన మంత్రిమండలి సహచరుల ఆలోచనలకు అనుగుణంగా సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 25 తర్వాత భారీ బదిలీలు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ముందుగా కీలక శాఖల్లో మార్పులు చేసి, ఆ తర్వాత కిందిస్థాయిలో దాదాపు 90శాతం ఉద్యోగుల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా స్థానచలనం కల్పించాలని యోచిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపత్యంలో పరిపాలనా సౌలభ్యం దిశగా దిశగా, అదే సమయంలో సంస్థాగతంగా మార్పుల ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సీఎం సూచనల మేరకు లిస్ట్ ఔట్ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి.. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి సమాచారం అందించినట్లు సచివాలయ వర్గాల ద్వారా సమాచారం అందింది. బదిలీల ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ నెలాఖరుతో పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో కొత్త సీఎస్ నియామకంపై కూడా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. తెలంగాణ ప్రభు గడిచిన ఏడాదిన్నర కాలంగా వివిధ కోణాల్లో మార్పులు, చేర్పులతో సుస్థిర పాలన దిశగా రేవంత్ సర్కారు అడుగులు వేస్తోందని కాంగ్రెస్ నేతలు అన్నారు. తన మంత్రిమండలి సహచరుల ఆలోచనలకు అనుగుణంగా సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 25 తర్వాత భారీ బదిలీలు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ముందుగా కీలక శాఖల్లో మార్పులు చేసి, ఆ తర్వాత కిందిస్థాయిలో దాదాపు 90శాతం ఉద్యోగుల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా స్థానచలనం కల్పించాలని యోచిస్తున్నారు.

## మే 5న రాష్ట్రానికి నితిన్ గడ్కరీ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఓపెనింగ్



హైదరాబాద్, వెలుగు: కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వచ్చే నెల 5న రాష్ట్రానికి రానున్నారు.

ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఓపెనింగ్ చేయనున్నారు. గోల్నాక, చే నెంబర్ మధ్య నిర్మించిన ఫ్లైఓవర్, బీహెచ్ఈఎల్ దగ్గర నిర్మించిన ఫ్లైఓవర్, ఆరాంఘర్-శంషాబాద్ మధ్య హైవే విస్తరణ, శంషాబాద్‌లో ఫ్లైఓవర్‌ను గడ్కరీ ఓపెనింగ్ చేస్తారని నేషనల్ హైవే అథారిటీ అధికారులు తెలిపారు. హైదరాబాద్-విజయవాడ హైవేపై ప్రమాదాలు జరుగుతున్న 17 బ్లాక్ స్పాట్స్ మరమ్మతుల ప్రాజెక్టుకు, గౌరెల్లి నుంచి వలిగొండ, తొర్రూరు, మహబూబాబాద్, కొత్తగూడెం వరకు నిర్మించనున్న హైవేలో భాగంగా గౌరెల్లి నుంచి వలిగొండ వరకు తొలి ప్యాకేజ్ పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. వీటితో పాటు నల్గొండ చుట్టూ రూ.516 కోట్లతో నిర్మించనున్న రింగ్ రోడ్డుకూ శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్.. స్కూటీలు, బంగారం ఇస్తామని మోసం చేసారు..!



వరంగల్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఓరుగల్లులోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆమె ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆపై మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆవిడ మాట్లాడుతూ.. తెలంగాణ ఉనికిని కోల్పోతున్న సమయంలో కేసీఆర్ పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంతో అందరినీ ఒక్క తాటికి పైకి తెచ్చి తెలంగాణ ను ఉనికి కాపాడాడన్నారు. 2001లో కేసీఆర్ పెట్టిన తెలంగాణ పార్టీ టిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. వరంగల్ గడ్డ అంటే ఉద్యమాల గడ్డని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని.. వరంగల్ లో సభ పడితే విదేశాల్లో ఉన్న వాళ్ళు కూడా వచ్చి మద్దతు తెలిపారని గుర్తు చేసారు. ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లల్ని మోసం చేసిందని.. స్కూటీలు ఇస్తామని విద్యార్థులు మోసం చేసారని అన్నారు. అలాగే బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేసారని తెలిపారు. ఇలా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలంటే మహిళలు సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. తెలంగాణ తలపై కాళేశ్వరం నిర్మించి రైతన్నకు మరోసారి ఇచ్చిన కేసీఆర్ కు మద్దతుగా రైతన్నలు పెద్ద ఎత్తున సభలో పాల్గొనలన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో 12 మంది చనిపోతే ఒత్తిడి మేరకు మాత్రమే తెలంగాణ ఇచ్చిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ మోసం చేస్తుంది కుట్రలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఆ కుట్రలన్నిటిని పటాపంచలు చేయాలంటే ఈ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కేసిఆర్ మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించే లాగా రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత ఉందని, ఎల్కతుర్తి సభలో ప్రత్యేక మహిళా గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నమని, సభకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని అవ్విడా తెలిపారు. కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్.. ప్రజలకు నీ మోసం ఏంటో తెలిసిపోయిందని, 16 నెలల్లోనే మీరు ఏమి చేయలేరని తెలంగాణ ప్రజలకు తేలిపోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకుల్లారా అవాకలు చెవాకులు పేలుస్తున్నారు. మా సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునే అంత మంది కూడా మీరు ఉండరు. అవాకులు, చివాకులు పేలిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. రూపాంతరం చెందడం అనేది సర్వసాధారణం.. టీఆర్ఎస్ బీఆర్ఎస్ గా రూపాంతరం మాత్రమే చెందింది.. పార్టీ మారలేదని ఆవిడ మాట్లాడారు.

## వరంగల్‌లో 14 మంది మావోయిస్టుల లొంగుబాటు





వరంగల్: వరంగల్‌లో 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఒక్కో మావోయిస్టుకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడారు. "రెండు నెలలుగా మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాం. ఈ ఏడాది 250 మంది సరెండర్ అయ్యారు. నేడు 14 మంది లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25వేలు అందజేశాం. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే మా ఉద్దేశం. ఏ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు వచ్చి లొంగిపోయినా సహకారం అందిస్తాం. జనజీవన స్రవంతిలో కలిస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

## అఖిలపక్ష భేటీకి అన్ని పార్టీలను ఆహ్వానించాలి: అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. ఈ భేటీపై బుధవారం రాత్రి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో మాట్లాడానని, ఐదు నుంచి 10 ఎంపీలున్న పార్టీలతో భేటీ యోచన ఉన్నట్లు చెప్పారని అన్నారు. " తక్కువ ఎంపీలున్న పార్టీలను ఎందుకు ఆహ్వానించరని అడిగా. అందర్నీ పిలిస్తే భేటీకి ఎక్కువ సమయం పడుతుందని చెప్పారు. ఇది కేవలం భాజపా లేదా ఇతర పార్టీల అంతర్గత భేటీ కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అఖిలపక్ష భేటీ అనే గట్టి సందేశం ఇవ్వాలి. అఖిలపక్షాల సూచనలకు ప్రధాని మరో గంట సమయం కేటాయించలేరా? మీ సొంత పార్టీకి పూర్తి మెజార్టీ లేదు. ఇది కేవలం రాజకీయ అంశం కాదు.. జాతీయ సమస్య. నిజమైన అఖిలపక్ష భేటీ నిర్వహించాలని మోదీని కోరుతున్నా. పార్లమెంట్‌లో ఎంపీలున్న అన్ని పార్టీలను భేటీకి ఆహ్వానించాలి" అని అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

## మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్ ప్రకటనలపై హైకోర్టులో పిల్



హైదరాబాద్: నగరంలోని మెట్రో రైళ్లలో నిషేధిత బెట్టింగ్ యాప్ ప్రకటనలపై హైకోర్టులో పిల్ దాఖలైంది. న్యాయవాది నాగూర్ బాబు ఈ పిల్ వేశారు. అనంతరం ఆయన తన వాదనలు వినిపించారు. "బెట్టింగ్ యాప్‌లను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినా మెట్రో రైళ్లలో మాత్రం ప్రకటనలు ఇస్తున్నారు. కొన్ని బెట్టింగ్ యాప్‌లపై ఇప్పటికే ఈడీ విచారణ కొనసాగుతోంది. మెట్రో రైళ్లలో ఈ ప్రకటనలపైనా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. మెట్రో రైళ్లలో 2022 తర్వాత బెట్టింగ్ యాప్ ప్రకటనలు ప్రదర్శించలేదని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరారు. ఇరువైపుల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది.

## హవాలా వ్యాపారులపై ఈడీ దాడుల కలకలం..



హైదరాబాద్‌లో మరోసారి ఈడీ దాడులు కలకలం రేపుతున్నాయి. ఏకకాలంలో ఏకంగా 13 మంది హవాలా ఆపరేటర్లపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పలువురుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అయితే, గతంలోనూ దేశవ్యాప్తంగా హవాలా వ్యాపారులపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఢిల్లీ, జైపూర్, బెంగాల్, కోల్‌కతాలోనూ దాడులు చేశారు. తనిఖీల్లో భారీ మొత్తంలో హవాలా డబ్బుని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ, కోటి, బషీరాబాగ్ ప్రాంతాల్లో హవాలా సొమ్ము పెద్ద మొత్తంలో పట్టుబడ్డింది. అయితే హైదరాబాద్‌లో హవాలా నడిపిస్తున్న వ్యక్తులే టార్గెట్‌గా ఈ దాడులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో నగరంలో హవాలా కేసులో పట్టుబడిని నిందితుల లిస్ట్ ఆధారంగా ఈడీ అధికారులు దాడులు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com